Follow: @ANNTELUGU
ANN తెలుగు
30-12-2024
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 29 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## టాప్ న్యూస్

### హెచ్1బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే



- డొనాల్డ్ ట్రంప్
- వైఖరి మార్చుకున్న ట్రంప్

02

### భయపడం భయపెడతాం



- కేసులకు వెనక్కు తగ్గేదే లేదు
- హామీల అమలుకు రాజీలేని పోరాటం చేస్తాం
- ప్రశ్నిస్తే కేసులా..?
- ఎమ్మెల్సీ కవిత

03

### సంక్రాంతిలోపు ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాల్సిందే



- తక్షణమే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి
- లేకపోతే బీజేపీ మహోద్యమం తప్పదు
- మన్మోహన్ ను రబ్బర్ స్టాంప్ గా మార్చింది కాంగ్రెస్
- కేంద్ర మంత్రి బండి సంజయ్

03



## కన్నుల పండువగా కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

**ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పణ**

పాల్గొన్న ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

భారీగా తరలివచ్చిన భక్తులు

ప్రత్యేక ఆకర్శణగా నిలిచిన ఒగ్గుకథ, జానపదా కళారూపాలు

మల్లన్న స్వామి నామస్మరణతో మారుమోగిన పరిసరాలు

వివరాలు 3లో



## తెలంగాణలో మన్మోహన్ సింగ్ విగ్రహం?

**అసెంబ్లీ లేదా సచివాలయం ముందు ఏర్పాటుచేసే అవకాశం**

**హైదరాబాద్, మహా:** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎదురుగా ఉన్న మాజీ ప్రధాని రాజీవ్, ఇందిరా గాంధీ విగ్రహాలకు సమీపంలోనే ప్రతిష్టించాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ ముందు లేదా సచివాలయం ముందు లేదా ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించేందుకు ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. సోమవారంజరిగే సమావేశంలో ప్రభుత్వం దీనిపై అధికారిక నిర్ణయం వెల్లడించే అవకాశం ఉంది.



# సాగు రైతుకే భరోసా

## కేబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయ నిర్ణయం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన కీలక భేటీ

- రెండు గంటలకు పైగా చర్చించిన కేబినెట్ సబ్ కమిటీ
- రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ మార్గదర్శకాలు సిద్ధం
- పెట్టుబడి సాయం కోసం ఏడు ఎకరాల సీలింగ్ విధించే అవకాశం
- ఒక కుటుంబంలో ఎందరి పేరిట ఎంత భూమి ఉన్నా.. మొత్తంగా ఏడెకరాలకే పెట్టుబడి సాయం!
- ఎన్ఆర్ఎస్సీ సహకారంతో సాగు భూముల శాటిలైట్ సర్వే
- క్షేత్ర స్థాయిలో సహాయ వ్యవసాయ అధికారులతో నిర్ధారణ
- ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు పెట్టుబడి సాయం కట్?
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలోని కొన్ని మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** సంక్రాంతి నుంచి తెలంగాణలో అమలు చేయాలని చూస్తున్న రైతు భరోసా పథకంపై కీలక భేటీ జరిగింది. రైతు భరోసా ఎవరికి వర్తింపజేయాలన్న దానిపై రెండుగంటలకు పైగా చర్చించిన కేబినెట్ సబ్ కమిటీ సాగుచేసే రైతులకే భరోసానివ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం ఇచ్చినట్లు ఫామ్ హౌజ్ లకు, కొండలకు, రోడ్లకు కూడా రైతుభరోసా ఇవ్వలేమని ఈ సందర్భంగా మంత్రులు తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఆదివారం సబ్ కమిటీ భేటి రాష్ట్ర సచివాలయంలో జరిగింది.

రాష్ట్ర సచివాలయంలో దాదాపు రెండు గంటల పాటు నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అనేక విషయాలు చర్చకు వచ్చాయి. ఏఏ వర్గాల రైతులకు పెట్టుబడి సాయం అందించాలి, ఏ వర్గాల రైతులకు ఈ సాయాన్ని మినహాయించాలి అనే విషయంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఇప్పటికే వివిధ ప్రవేట్ సంస్థలతో సమావేశం నిర్వహించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. శాటిలైట్ టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించారు. దీని ద్వారా మండలాలు, గ్రామాల వారీగా భూముల వివరాలను సేకరించడం.. సాగులో ఉన్న భూములు, అందులో పండించిన పంటల వంటి సమగ్ర వివరాల

మిగతా 2లో

**కేబినెట్ భేటీలోగా ఫైనల్**

సోమవారం జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడడంతో జనవరి 3తర్వాత జరిగే కేబినెట్ భేటీ నాటికి విధివిధానాలు నిర్ధారించి కేబినెట్ ముందుకు తీసుకువెళ్ళాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. సంక్రాంతికి ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుభరోసా ప్రారంభించాలన్న గట్టి నిర్ణయంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేటు

**నివేదిక విడుదల చేసిన డీజీపీ జితేందర్ బాబు**

**వెలుగులోకి సంచలన విషయాలు**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక క్రైమ్ నివేదికను డీజీపీ జితేందర్ బాబు తాజాగా విడుదల చేశారు. ఈ నివేదికలో తెలంగాణలో క్రైమ్ రేటు, లా & ఆర్డర్, సైబర్ క్రైమ్, డ్రగ్స్ స్మగ్లింగ్ వంటి వివిధ అంశాలను వెల్లడించారు. దీని ప్రకారం 2024లో తెలంగాణలో క్రైమ్ రేటు గణనీయంగా పెరిగింది. 2023తో పోలిస్తే, ఈ ఏడాది 9.87 శాతం పెరిగి 2,34,158 కేసులు నమోదు అయ్యాయి. కానీ, శాంతి భద్రతల అంశం మరింత మెరుగుపడినట్లు డీజీపీ తెలిపారు. ఒకటి రెండు మినహా అన్ని ప్రాంతాలలో శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని పేర్కొన్నారు.

**నక్సల్స్, డ్రగ్స్**

ఈ ఏడాది తెలంగాణ పోలీసులు 85 మంది నక్సల్స్‌ను అరెస్టు చేయగా, 41 మందిని సరెండర్ చేయించారు. అలాగే, డ్రగ్స్ పై తీవ్ర చర్యలు తీసుకోవడం కొనసాగించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,942 డ్రగ్స్ కేసులు నమోదు చేసి, 4,682 మందిని అరెస్టు చేశారు. రూ. 142.95 కోట్ల

మిగతా 2లో

**సైబర్ క్రైమ్ పెరుగుదల**

సైబర్ క్రైమ్‌లో కూడా తెలంగాణలో ఈ ఏడాది 43.33 శాతం పెరుగుదల కనిపించింది. 25,184 సైబర్ క్రైమ్ కేసులు నమోదు అయ్యాయి. ఈ క్రైమ్‌లలో రూ. 180 కోట్లు వదిలిన ఫండ్స్ రీఫండ్ అయిపోతే, రూ. 247 కోట్లు విలువైన ఆస్తులను పోలీసులు ఫ్రీజ్ చేశారు.

## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,840 |
| 22 క్యారెట్ | 71,350 |
| సిల్వర్ (కేజీ) | 92,500 |

## స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 78,699.07 |
| నిఫ్టీ ↗ | 23,813.40 |

## ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.5 | 165 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.5 | 165 |
| రిటైల్ గుడ్డు ధర | 5.83 | 174.09 |



కన్హా శాంతి వనంను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

03

## ఒకే రోజు ముగ్గురు పోలీసులు మృతి

**ఇద్దరు బలవన్మరణం..**

మరొకరు గుండెపోటుకు గురై..

వేర్వేరు ఘటనల్లో తీరని విషాదం




వివరాలు 3లో



# పవన్ విశ్వరూపం 2024

## పవన్ నామ సంవత్సరం

“ ఈ ఏడాది ఖచ్చితంగా పవర్ నామ సంవత్సరం. జనసైనికులకు పవన్ నామ సంవత్సరం. గత దశాబ్దంన్నర పోరాటానికి, ఆరాటానికి, ప్రజలపై ఉన్న ప్రేమకు, సమాజాన్ని మార్చాలన్న తపనకు, రాజకీయ తారగా వెలిగిపోవాలనుకున్న లక్ష్యానికి.. అన్నింటికీ ఒకే ఒక్క దెబ్బతో పవన్ కల్యాణ్ సమాధానం చెప్పిన ఏడాది 2024. లక్కీ ఇయర్ కాదు.. లక్ష్యాన్నిసాధించిన ఇయర్ గా 2024 అనేక తీపిగురుతులను అందించింది. పవన్ కల్యాణ్ అంటే ఒక్క ఆంధ్రా రాజకీయాలే కాదు.. భారతదేశ రాజకీయాలు కూడా మాట్లాడుకునేలా విశ్వసనీయత, నిబద్దత, నిజాయితీని సముపార్జించిన ఏడాది 2024. ప్రత్యర్థులకు పవన్ పంజా చూపిన ఏడాది. ప్రజలు గుండెలు చీల్చుకుని పవన్ ను ప్రతిష్టించుకున్న ఏడాది 2024.

ప్రత్యేక కథనం 4లో

- మహా ప్రత్యేకం

## మంత్రి కోమటిరెడ్డికి సీఎం ఫోన్

**ట్రిపుల్ఆర్‌కు టెండర్లపై హర్షం**

- మీ కృషి వల్లే ట్రిపుల్ ఆర్ పట్టాలెక్కిందంటూ ప్రశంసలు
- ఏడేళ్ళతర్వాత ప్రాజెక్టు ముందడుగు
- సీఎం సహకారానికి కృతజ్ఞతలు తెలిపిన కోమటిరెడ్డి



02



# దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

## 179 మంది మృతి

**ఘటనకు కారణాలు అవేనా?**

“ దక్షిణ కొరియా ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 179 మంది మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. థాయ్లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన ది జేజు ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7C2216 విమానం ల్యాండ్ అవుతూ అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నించిన సమయంలో ల్యాండింగ్ గేర్ సమస్యతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. - మహా

02

# తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లిన ఏఎన్ఆర్



## మన్ కీ బాత్‌లో అక్కినేని నాగేశ్వరరావుపై ప్రధాని మోదీ ప్రశంసలు

**ఆయన తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని వ్యాఖ్య.. మహా కుంభమేళాను ఐక్యతా మహాకుంభంగా అభివర్ణించిన ప్రధాని**

**ఢిల్లీ, మహా:** భారత చలనచిత్ర రంగానికి చెందిన నలుగురు దిగ్గజాలు అక్కినేని నాగేశ్వరరావు, రాజ్ కపూర్, మహ్మద్ రఫీ, తపన్ సిన్హాను మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ స్మరించుకున్నారు. దేశానికి ప్రపంచ గుర్తింపు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన సినీ ప్రముఖుల శత జయంతి వేడుకలను 2024లో జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ దిగ్గజాలు భారత చలనచిత్ర పరిశ్రమకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఏఎన్ఆర్ తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని మోదీ కొనియాడారు. ఆయన సినిమాలు భారత సంప్రదాయాలు, విలువలను అందంగా ఆవిష్కరించాయని చెప్పారు. సినిమాల ద్వారా రాజ్ కపూర్ దేశ సాఫ్ట్ పవర్ గురించి ప్రపంచానికి తెలిసేలా చేశారని మోదీ తెలిపారు. మహ్మద్ రఫీ మాయాస్వరం ప్రతి శ్రోత హృదయాన్ని తాకుతుందని ప్రధాని అన్నారు. తపన్ సిన్హా సినిమాలు సామాజిక స్పృహ, జాతీయ సమైక్యత సందేశాన్ని అందించాయని గుర్తు చేశారు. మహాకుంభ మేళా ఐక్యతా కుంభం'

ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13న ప్రారంభంకానున్న మహా కుంభమేళాను ఐక్యతా మహాకుంభంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. యావత్ దేశం ఐక్యంగా ఉండాలనే సందేశం మహాకుంభ మేళా నుంచి వెలువడాలని చెప్పారు. మహాకుంభ మేళా ప్రత్యేకత విశాలతలోనే కాదు, వైవిధ్యంలో కూడా ఉందని ప్రధాని పేర్కొన్నారు. కుంభమేళాలో తొలిసారిగా AI చాట్‌బాట్‌ను ఉపయోగించనున్నట్లు తెలిపిన మోదీ మేళాకు సంబంధించిన అన్ని రకాల సమాచారం AI చాట్‌బాట్ ద్వారా 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు.

వచ్చే గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతుందని మోదీ గుర్తుచేశారు. రాజ్యాంగం వల్లే తన జీవితంలో ఈ స్థానానికి చేరుకున్నానని, అది అందరికీ మార్గదర్శకమని ప్రధాని తెలిపారు. రాజ్యాంగంలోని నిబంధనలు, స్ఫూర్తితో ప్రజలను కనెక్ట్ చేయడానికి కాన్‌స్టిట్యూషన్ 75 డాట్‌కామ్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు మోదీ తెలిపారు. రాజ్యాంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయని, వాటిని అధికార పక్షం తీవ్రంగా ఖండిస్తోందని గుర్తు చేశారు.

# సాగు రైతుకే భరోసా



(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకోనున్నారు. క్షేత్ర స్థాయిలో వచ్చిన సమాచారాన్ని, సాంకేతికంగా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి అర్హులను నిర్ధరించాలని.. వారికి మాత్రమే రైతు భరోసా సాయాన్ని అందించాలని నిర్ణయించారు. దానికి కొనసాగింపుగా.. జరిగిన సబ్ కమిటీ భేటీలో రైతు భరోసా విధి విధానాలపై లోతైన చర్చ జరిగింది. కాగా.. ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసాను అమలు చేయాలనే కీలక అంశం మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా అందించారు. ఈ విధానంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యింది. వందల ఎకరాల పొలాలున్న రైతులకు పెట్టుబడి సాయం ఎందుకనే ప్రశ్నలు ఎదురయ్యాయి.. ఈ నేపథ్యంలో ఎన్ని ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా అందిస్తే బాగుంటుందనే విషయంపై మంత్రివర్గం చర్చించింది.

### రైతులకు సాయంగా..

రైతులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలు తీసుకుని ఇబ్బందులు పడకుండా నిరోధించడం, అప్పులు చేసిన వారికే తక్కువ ధరకు పంటల్ని విక్రయించకుండా చేసేందుకు రైతు భరోసా అక్కరకు వస్తుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే.. చిన్న, సన్నకారు, మధ్యస్థాయిలో రైతులకు మాత్రమే రైతు భరోసా అందించేలా నిబంధన పెడితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగింది. కానీ.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే.. ప్రభుత్వానికి పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులను సైతం రైతు భరోసాకు అనర్హులుగా ప్రకటించాలనే చర్చ నడిచింది. ప్రధానమంత్రి సమ్మాన్ యోజన పథకానికి సంబంధించిన కొన్ని నిబంధనలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధులకు, ఐటీ చెల్లించేవారిని మినహాయించాలన్న ప్రతిపాదనపైనా చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆయా శాఖల తరపున సమగ్ర విషయాలతో సాంకేతిక సమాచారం, గణాంకాలను ఆధారంగా చేసుకుని మంత్రివర్గ ఉపసంఘం రైతు భరోసా పై చర్చించింది. ప్రస్తుత సమావేశంలో రైతు భరోసా పథకం అమలుకు అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారు కాకపోవడం వల్ల మరోసారి సమావేశం నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.



# తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేటు

(మొదటిపేజీ తరువాయి)

విలువైన డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు.

**కొత్త చట్టాల అమలులో చర్యలు:**

2024లో కొత్త చట్టాల అమలు ప్రారంభమైంది. ఈ కొత్త చట్టాల కింద 85,190 కేసులు నమోదు అయ్యాయి. "జీరో FIR" వ్యవస్థను అమలు చేయడంతో, 1,313 కేసులు న్యాయ విధానం ద్వారా నమోదు చేయబడ్డాయి.

**పోలీసుల భర్తీ, డయల్ 100 సేవలు:**

ఈ ఏడాది 547 SIలను, 12,338 కానిస్టేబుళ్లను నియమించారు. డయల్ 100 సేవకు నమ్మకంగా స్పందించిన ప్రజలు 16,92,173 కాల్స్ చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో పోలీసుల ఆత్మహత్యలు సహా పలు అంశాలపై డీజీపీ స్పందించారు.

**ఆత్మహత్యల కారణాలు:**

ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు, ఫ్యామిలీ సమస్యలు అనేవి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ప్రతి సంవత్సరమూ ఏదో ఒక కారణం వల్ల ప్రజలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వర్క్ ప్రెజర్స్ (పని ఒత్తిడిని) కారణంగా కూడా కొన్ని సందర్భాలలో ఆత్మహత్యలు జరిగాయని ఆయన అన్నారు.

**పోలీసుల చర్యలు:**

ఆత్మహత్యలకు గురయ్యే వారికి ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించడం, కౌన్సిలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించడం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

**అల్లు అర్జున్ కేసు:**

ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉంది, దీనిపై సమగ్ర విచారణ జరుగుతున్నట్లు చెప్పారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసు:**

ఈ కేసులో కూడా విచారణ కొనసాగుతోంది. ఇందులో సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) కి లేఖ రాశారు.

### సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**ఈ ఏడాది తెలంగాణలో క్రైమ్ రేటు పెరిగినప్పటికీ, శాంతి భద్రతలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై అధికారుల చర్యలు విశేషమైనవిగా ఉన్నాయి. ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్న పోలీసులు, నూతన చట్టాల ద్వారా న్యాయ వ్యవస్థను మరింత సమర్థంగా చేశారని డీజీపీ ఈ సందర్భంగా తెలిపారు. 2024లో శాంతి, భద్రతల ప్రాముఖ్యత మరింత పెరిగినట్లుగా ఈ నివేదిక ద్వారా తెలుస్తోంది.**

### ప్రభాకర్ రావు కేసు

**అమెరికా నుంచి ప్రాథమిక ప్రక్రియ ద్వారా భారత్‌కు రప్పించేందుకు ఇంటర్నేషనల్ ప్రాసెస్ జరుగుతోంది. ఇంటర్‌పోల్ సహాయం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.**

# దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

**179 మంది మృతి.. ఘటనకు కారణాలు అవేనా?**



**మహా:** దక్షిణ కొరియా ముయాన్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టులో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 179 మంది మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. థాయ్లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి బయల్దేరిన ది జేజు ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7C2216 విమానం ల్యాండ్ అవుతూ అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నించిన సమయంలో ల్యాండింగ్ గేర్ సమస్యతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.

### ప్రమాదానికి కారణం ఏమిటి?

విమానం నేలపైకి దిగే సమయంలో ల్యాండింగ్ గేర్, టైర్లు ఫెయిల్ అయ్యాయని కొందరు, పక్షిని ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని మరికొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అందుకు బలం చేకూర్చేలా విమానం ల్యాండింగ్ యత్నించే సమయంలో ఓ ఇంజిన్ నుంచి ఒక్కసారిగా నిప్పులు బయటకు వచ్చిన దృశ్యాలను సోషల్ మీడియాలో ప్రత్యక్షం అయ్యాయి.

### గేర్ వైఫల్యం వల్లే

విమానం ల్యాండింగ్ గేర్ వైఫల్యం కారణంగా, బెల్లీ ల్యాండింగ్ చేసేందుకు పైలట్ ప్రయత్నించినట్లు వీడియోల్లో కనిపిస్తోంది. విమానం పొట్ట భాగం రన్వేపై ఉంది. దీంతో ల్యాండింగ్ గేర్లో సాంకేతిక లోపం కారణంగా తెరుచుకోకపోవడం వల్ల పైలట్ ఆ విధంగా చేసినట్లు తెలుస్తోంది. అయితే యోన్హాప్ నివేదిక ప్రకారం, 'సాధారణ ల్యాండింగ్ విఫలం కావడం వల్ల పైలట్ క్రాష్ ల్యాండింగ్కు ప్రయత్నించారు. విమానాన్ని అంతకు ముందే పక్షి ఢీకొని ఉండొచ్చు. పక్షి ఢీకొన్న తర్వాతే ఒకదాని తర్వాత ఒకటి సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ల్యాండింగ్ గేర్ వైఫల్యం, బెల్లీ ల్యాండింగ్ ప్రమాదానికి కారణమయ్యాయి. విమానం ల్యాండింగ్ గేర్, టైర్లు వంటివి యాక్టివేట్ కాలేదు'. అయితే పలువురు నెటిజన్లు విమానాశ్రయ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 3 కిమీ కంటే తక్కువ పొడవు ఉన్న రన్వేపై బెల్లీ ల్యాండింగ్ జరిగితే, అగ్నిమాపక సిబ్బంది ఎందుకు పొజిషన్ తీసుకోలేదని ప్రశ్నించారు. విమానం బెల్లీ ల్యాండింగ్కు ప్రయత్నించే ముందు ఎలాంటి చక్కర్లు కొట్టలేదని మరొకరు ప్రశ్నించారు.

### విచారణ తర్వాత కారణాలు వెల్లడిస్తాం

**ఇంజిన్‌ను పక్షి ఢీకొనడం, వాతావరణ పరిస్థితులు కారణంగా విమాన ప్రమాదం జరిగి ఉండొచ్చని దక్షిణ కొరియా ఫైర్ చీఫ్ లీ జియోంగ్ హైయూన్ తెలిపారు. ఉమ్మడి విచారణ తర్వాత ప్రమాదానికి గల కచ్చితమైన కారణాన్ని వెల్లడిస్తామని పేర్కొన్నారు. మరోవైపు, జరిగిన ప్రమాదానికి థాయ్ లాండ్కు చెందిన జేజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. ప్రమాద నివారణకు తాము శక్తివంచన లేకుండా ప్రయత్నించినట్లు పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రకటించింది.**

# హెచ్1బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే: డొనాల్డ్ ట్రంప్

### వైఖరి మార్చుకున్న ట్రంప్

**మహా:** హెచ్1బీ వీసాల విస్తరణపై అమెరికా ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారింది. గతంలో హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌ను వ్యతిరేకించిన ట్రంప్, తాజాగా దానికి మద్దతు ప్రకటించారు. హెచ్1బీ వీసా విస్తరణను ఒక గొప్ప కార్యక్రమంగా అభివర్ణించిన ట్రంప్, ముందు నుంచి తాను దీనికి అనుకూలంగానే ఉన్నానని తెలిపినట్లు న్యూయార్క్ పోస్టు పేర్కొంది. తొలిసారి అధికారం చేపట్టినప్పుడు హెచ్1బీ వీసాలపై ఆంక్షలు విధించిన ట్రంప్, అవి దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. ఈ హెచ్1బీ వీసాల వల్ల అమెరికాపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. అమెరికన్ కార్మికుల స్థానంలో విదేశీ ఉద్యోగులకు తక్కువ జీతం ఇస్తూ భర్తీ చేయడానికి కంపెనీలు హెచ్1బీ వీసాలను సాధనంగా ఉపయోగిస్తున్నాయని విమర్శించారు. కోవిడ్ 19 మహమ్మారి కారణంగా ఏర్పడిన ఆర్థిక సవాళ్లకు ప్రతిస్పందనగా 2020లో హెచ్1బీ వీసాల జారీపై మరింత కఠినతరమైన ఆంక్షలు కూడా విధించారు. అయితే హెచ్1బీ వీసాల విస్తరణపై ట్రంప్ మద్దతుదారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుండగా, రిపబ్లికన్ పార్టీలోని మరికొందరు అమెరికా ఫస్ట్ కే జైకొడుతున్నారు.

# మంత్రి కోమటిరెడ్డికి సీఎం ఫోన్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రాంతంలో గేమ్ ఛేంజర్ గా పిలవబడుతున్న ట్రిపుల్ఆర్ పనులకు మోక్షం లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యాపీగా ఉన్నారు. సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎ రేవంత్ రెడ్డి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఆదివారం ఉదయం ఫోన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సీఎం అభినందించారు. మీ కృషి సహకారంతో ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కిందని కోమటిరెడ్డిని అభినందించారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టు మీ సహకారంతో కేవలం ఏడాదిలో సాధ్యమైందని తెలిపారు . ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 161 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టును 5 ప్యాకేజీలు విభజించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం 7, 104 కోట్ల రూపాయలు. వచ్చేఏడాది ఫిబ్రవరి 15న బిడ్ దాఖలు చేసుకోవచ్చు. రెండు రోజుల తర్వాత వాటిని తెరవడం, ఆపై ఆమోదించడం జరుగుతుంది. ముఖ్యంగా ఆర్థిక, సాంకేతిక విభాగాల్లో ఈ బిడ్ దాఖలు చేయాల్సి ఉంటుంది. దక్షిణ భాగంపై కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.







# వివేక్, కంది కీలక భేటీ


**ఆదిలాబాద్ పాలిటిక్స్‌లో చర్చ**

- ముఖ్యమంత్రికి విధేయుడిగా కందికి పేరు
- ఎమ్మెల్సీ రేసులో కంది శ్రీనివాసరెడ్డి
- మంత్రి పదవిని ఆశిస్తున్న వివేక్

**ఆదిలాబాద్, మహా:** చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం ఆదిలాబాద్ వచ్చారు. తన క్యాంపుకార్యాలయంలో కంది శ్రీనివాసరెడ్డి వివేక్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వివేక్ మంత్రిపదవిని ఆశిస్తున్నారు. మరోవైపు ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జిగా ఉన్న కంది శ్రీనివాసరెడ్డి పేరు ఎమ్మెల్సీ కోసం బలంగా వినబడుతోంది. ఈ క్రమంలో ఆదిలాబాద్ లో ఇద్దరు నేతల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. కంది శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వీరవిధేయుడు కాగా, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇరువురు నేతల భేటీపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.







# కన్నుల పండువగా కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

**హైదరాబాద్, మహా:** కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ ప్రధాన అర్చకులు సమర్పించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరఫున పడిగన్నగారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవీ తరఫున మహాదేవుని వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద గల కల్యాణ వేదికలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముక్కోటి దేవదూతలు, పంచభూతాలు, వీరశైవ అర్చకుల వేదమంత్రాలు, భక్తకోటీ జయజయధ్వానాల మధ్య గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మలను కొమురవెల్లి మల్లన్న వివాహమాడారు. కన్నుల పండువగా జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డితోపాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో కొమురవెల్లి కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మల్లన్న స్వామి నామస్మరణతో మారుమోగాయి.

**3 నెలల పాటు బ్రహ్మోత్సవాలు**

ఉదయం 5 గంటలకు స్వామివారికి దిష్టికుంభం(బలిహరణం), మధ్యాహ్నం 12 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, రథోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా నేడు కూడా ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అనంతరం మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మల్లన్న కళ్యాణంతో జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు నెలల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి.

**ప్రతి సంవత్సరం ఆనవాయితీ..**

స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సంక్రాంతి పండుగకు ముందు కన్నుల పండువగా నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈసారి కూడా సమర్పించారు.

**పచ్చదనం ఉట్టిపడేలా..**


మల్లన్న కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక తోటబావి ప్రాంతంలో నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, షామియానాలు, పచ్చదనం ఉట్టిపడేవిధంగా పలు ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నూతన క్యూలైన్ల నిర్మాణం చేపట్టడడంతో రాజగోపురం వద్ద చలువ పందిళ్లతో తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద తాగునీటి వసతిని సైతం ఏర్పాటు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔటసోర్సింగ్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇతర ప్రాంతాల నుంచి కొమురవెల్లికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నారు.

**ఒగ్గుకథ, జానపద కళారూపాలు**

స్వామివారి జాతర నేపథ్యంలో ఆలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. సాయంత్రం సమయంలో సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒగ్గుకథ, జానపద కళారూపాలు ప్రత్యేకంగా ఆకర్శణగా నిలిచాయి. ఒగ్గుకథలతో కళాకారులు భక్తులను ఎంతగానో అలరించారు.

**భారీ భద్రత...**

మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. 300 మందికి పైగా సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



## ముగిసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్

### పుస్తక ప్రియుల నుంచి భారీ స్పందన

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు**



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ బుక్ ఫెయిర్ పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ నెల 19 నుంచి 29 వరకు నిర్వహించిన 37వ పుస్తక ప్రదర్శనకు భారీ స్పందన వచ్చింది. లక్షల సంఖ్యలో పుస్తక ప్రియుల ఈ బుక్ ఫెయిర్ ను సందర్శించారు. దీంతో బుక్ ఫెయిర్ నిర్వాహకులు, బుక్ స్టాళ్ల నిర్వహకులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో కంటే ఈసారి ఊహించని విధంగా భారీ సంఖ్యలో సందర్శకులు విజిట్ చేశారని తెలిపారు. అయితే, ఈసారి యువతరం పుస్తక ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో తరలివచ్చింది. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతోపాటు చరిత్ర, గ్రంథాలు, కథలు, జీవిత చరిత్ర, స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను విరివిగా కొనుగోలు చేశారు. వీటితోపాటు రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలు కూడా ఎక్కువగా సేల్ అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ తోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడికి తరలివచ్చారు. ఇటు విద్యార్థులు కూడా భారీగానే బుక్ ఫెయిర్ ను సందర్శించారు. వారికి అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. కాగా, గతంలో కంటే ఈసారి ఎక్కువగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. తెలంగాణ రుచులతో కూడిన స్టాళ్లను సైతం బుక్ ఫెయిర్ లో ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా పలు ప్రత్యేకమైన స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున లభించింది. బుక్ ఫెయిర్ కు వచ్చిన ప్రతి ఒక్కరూ సంతోషంతో వెనుదిరిగారు. అదేవిధంగా ఈ పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు సైతం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసారి పదుల సంఖ్యలో కొత్త పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. దీంతో వర్ధమాన కవులు, రచయితలు సంతోషం వ్యక్తం చేశారు. గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, బండారు దత్తాత్రేయ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులతోపాటు చాలామంది ప్రముఖులు ఈ బుక్ ఫెయిర్ ను సందర్శించి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. సోషల్ మీడియా విజృంభిస్తున్న ఈరోజుల్లో బుక్ ఫెయిర్ ను నిర్వహించడం సంతోషకరమని, ఇటువంటి కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. యువత పుస్తకాల వైపు మళ్లాలని, పుస్తక పఠనంతో ఎంతో ఉపయోగమని సూచించారు. బుక్ ఫెయిర్ కొనసాగినన్నీ రోజులు ఎన్టీఆర్ స్టేడియం సందర్శకులతో కిటకిటలాడింది. పరిసరాల్లో కూడా ఏ ఒక్కరిని చూసినా పుస్తకాలతో దర్శనమిచ్చారు.

### సంక్రాంతిలోపు ఫీజు రీయంబర్స్ మెంట్

## చెల్లించాల్సిందే

**తక్షణమే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి.. లేకపోతే బీజేపీ మహోద్యమం తప్పదు**
**మన్మోహన్ ను రబ్బర్ స్టాంప్ గా మార్చింది కాంగ్రెస్**
**మన్మోహన్ ఆర్డినెన్స్ ను చింపేసి రాహుల్ గాంధీ అవమానించారు**
**పీవీని అడుగడుగున అవమానించిన మీకు మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేసే అర్హత లేదు**
**ట్రిపుల్ ఆర్ టెండర్లు ఆహ్వానించిన మోదీ ప్రభుత్వానికి తెలంగాణ పక్షాన ధన్యవాదాలు**
**కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, మహా :** సంక్రాంతి లోపు ఫీజు రీయంబర్స్ మెంట్ మొత్తాన్ని చెల్లించాలని, లేకపోతే బీజేపీ మహోద్యమం చేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో సంజయ్ దీన్ దయాళ్ కోచింగ్ సెంటర్ పేరిట తాను నిర్వహించిన కోచింగ్ సెంటర్ లో చదువుకుని ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులను సన్మానించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, హైదరాబాద్ వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకునే స్థోమత లేని నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం వల్లే ఈరోజు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అయినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, బిశ్వాల్ కమిటీ 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటించి 4 ఏళ్లయినా వాటిని భర్తీ చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని మండిపడ్డారు. 25 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గప్పాలు కొడుతోందని విరుచుకుపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని 2022 అక్టోబర్ లో ప్రకటించిందని, ఇచ్చిన మాట మేరకు ఇప్పటి వరకు 9.25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థులకు అపాయిట్ మెంట్ లెటర్లు కూడా ఇచ్చిందన్నారు. కానీ యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని సంజయ్ మండిపడ్డారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని మాట తప్పిందని, ఒక్కో నిరుద్యోగికి రూ.48 వేలు కాంగ్రెస్ పార్టీ బకాయి పడిందని, వెంటనే ఆ బకాయి ఇవ్వాలని, 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో బీజేపీ పక్షాన తీవ్రమైన ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు అల్లాడుతున్నారని, కాలేజీల యాజమాన్యాలు నష్టపోయి కాలేజీలు మూసుకునే దుస్థితి. విద్యార్థులపై ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని, అందుకే ప్రభుత్వానికి అల్టిమేటం ఇస్తున్నామన్నారు. సంక్రాంతిలోపు బకాయిపడ్డ ఫీజు రీయంబర్స్ మెంట్ సొమ్మును చెల్లించాల్సిందే.


### అంత్యక్రియలను రాజకీయం చేయడం తప్పు

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న పదేళ్లు సూపర్ ప్రధానిగా సోనియాగాంధీ కొనసాగుతూ రబ్బర్ స్టాంప్ గా మార్చారని విరుచుకుపడ్డారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తే ఆ ఆర్డినెన్స్ కాపీలను రాహుల్ గాంధీ చింపివేసి మన్మోహన్ ను దారుణంగా అవమానించారన్నారు. కానీ మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించి ఆయనకు ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు సిద్ధమైందని, కానీ మాజీ ప్రధానిగా పనిచేసిన పీవీ నర్సింహరావు అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన పార్టీ కాంగ్రెస్. వారికి మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేనేలేదన్నారు.

## భయపడం భయపెడతాం

### కేసులకు వెనక్కు తగ్గేదే లేదు

**హామీల అమలుకు రాజీలేని పోరాటం చేస్తాం**
**ప్రశ్నిస్తే కేసులతో బెదరిస్తున్నారు**
**నిజామాబాద్ లో ఎమ్మెల్సీ కవిత**



**నిజామాబాద్, మహా :** ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు తనపైన కేటీఆర్ పైన కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఎదుర్కోలేక రేవంత్ ప్రభుత్వం కుట్రలకు తెరతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై కేసులు అందుకే కేసులు పెట్టినంత మాత్రాన తాము భయపడే వాళ్ళం కాదని తాము భయపెట్టే రకాలమని కవిత హెచ్చరించారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేక తమపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. నిజామాబాద్ లో పర్యటించిన ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం దేశ రాష్ట్ర రాజకీయాలపైన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఏం మాట్లాడినా, ఏం చేసినా దేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసని, తమపై ఎన్ని కేసులు పెట్టినా నిప్పు కణికల్లాగా బయటకు వస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే కేంద్రాన్ని ఎదిరించినా కేసు, భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందన్నా కేసు, హీరో సీఎం పేరు మర్చిపోతే కేసు, రైతులు భూమి ఇవ్వకపోతే కేసు, సోషల్ మీడియా పోస్టులు పెడితే కేసు అన్నట్టు ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం మాట్లాడినా కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చిందని, వాటన్నింటినీ నెరవేర్చడం లేదంటూ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా స్కూటీలు వచ్చాయా? తులం బంగారం వచ్చిందా? అంటూ కవిత ప్రశ్నించారు. నిరుద్యోగులను, మహిళలను, ఉద్యోగులను, విద్యార్థులను అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కవిత మండిపడ్డారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ఇచ్చిన దరఖాస్తులను చెత్త కుప్పలో పడేశారన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దే విజయం అని కవిత జోస్యం చెప్పారు. చాలామంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ జరగలేదన్నారు. 57 మంది పిల్లలను గురుకులాలలో పొట్టన పెట్టుకున్నారని నిప్పులు చెరిగారు. ఇటు నుంచి సూర్యుడు అటు ఉదయించినా నిజామాబాద్ లో రాబోయే రోజులలో గులాబీ జెండానే ఎగురుతుందని కవిత పేర్కొన్నారు. వచ్చే లోకల్ బాడీ ఎలక్షన్స్ లోను, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కవిత ధీమా వ్యక్తం చేశారు.

## ఒకే రోజు ముగ్గురు పోలీసులు మృతి

### ఇద్దరు బలవన్మరణం.. మరొకరు గుండెపోటుకు గురై..

**వేర్వేరు ఘటనల్లో తీరని విషాదం**




**హైదరాబాద్, మహా:** తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వరుస ఆత్మహత్య ఘటనలు కలవరం రేపుతున్నాయి. తాజాగా మరో ముగ్గురు కానిస్టేబుళ్లు మృతి చెందారు. ఒకే రోజు వేర్వేరు ఘటనల్లో వీరు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు సూసైడ్ చేసుకోగా.. మరొకరు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. కామారెడ్డి జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య ఘటన మరవకముందే మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదాన్ని నింపింది.

**కొల్చారంలో చెట్టుకు ఉరేసుకుని..**

మెదక్ జిల్లాలో దారుణం జరిగింది. కొల్చారంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని సాయి అనే కానిస్టేబుల్ సూసైడ్ చేసుకున్నాడు. సాయి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం విచారణ ప్రారంభించారు.

**అప్పుల బాధ భరించలేక..**

మరో ఘటనలో.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాలకుంట కాలనీలో బాలకృష్ణ అనే ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన భార్య మానస, ఇద్దరు పిల్లలు యశ్వంత్, ఆశిరిత్‌కు పురుగుల మందు ఇచ్చాడు. అనంతరం తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కానిస్టేబుల్ బాలకృష్ణ మరణించగా.. అతడి భార్య, పిల్లలు ఇద్దరూ హస్పిటల్‌లో ట్రీట్మెంట్ పొందుతున్నారు. అప్పుల బాధతోనే కానిస్టేబుల్ బాలకష్ణ ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు చెబుతున్నారు.

**గుండెపోటుతో మరొకరు**

భువనగిరికి చెందిన మరో హెడ్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు గుండెపోటుతో మరణించాడు. శనివారం సాయంత్రం శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడ్డాడు. వెంటనే తోటి సిబ్బంది హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేశారు. కానీ మార్గ మధ్యంలోనే బాలరాజు మరణించాడు. అతడి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇలా ఒక్కరోజే ముగ్గురు మరణించిన ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## కన్హా శాంతి వనంను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 29, మహా:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా గ్రామంలోని కన్హా శాంతి వనంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక కన్హా శాంతి వనంలో శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్వాగతం పలికారు. కన్హా శాంతి వనంలో ముఖ్యమంత్రి మొక్కను నాటారు. అనంతరం ముఖ్యమంత్రి కన్హా శాంతి వనంను కలియ తిరిగారు. కన్హా శాంతి వనంలో పెంచుతున్న మొక్కలు, చెట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలోని ధ్యాన కేంద్రాన్ని పరిశీలించారు. సీఎం వెంట చేవెళ్ళ శాసనసభ్యులు కాలే యాదయ్య, షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, హెల్త్ సెంటర్ గ్లోబల్ గైడ్ దేవర్డ్ దార్జి, ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ తదితరులు ఉన్నారు.







# పవన్ విశ్వరూపం 2024



## పవన్ నామ సంవత్సరం

ఈ ఏడాది ఖచ్చితంగా పవర్ నామ సంవత్సరం. జనసైనికులకు పవన్ నామ సంవత్సరం. గత దశాబ్దంన్నర పోరాటానికి, ఆరాటానికి, ప్రజలపై ఉన్న ప్రేమకు, సమాజాన్ని మార్చాలన్న తపనకు, రాజకీయ తారగా వెలిగిపోవాలనుకున్న లక్ష్యానికి.. అన్నింటికీ ఒకే ఒక్క దెబ్బతో పవన్ కల్యాణ్ సమాధానం చెప్పిన ఏడాది 2024. లక్కీ ఇయర్ కాదు.. లక్ష్యాన్నిసాధించిన ఇయర్ గా 2024 అనేక తీపిగురుతులను అందించింది. పవన్ కల్యాణ్ అంటే ఒక్క ఆంధ్రా రాజకీయాలే కాదు.. భారత దేశ రాజకీయాలు కూడా మాట్లాడుకునేలా విశ్వసనీయత, నిబద్ధత, నిజాయితీని సముపార్జించిన ఏడాది 2024. ప్రత్యర్థులకు పవన్ పంజా చూపిన ఏడాది. ప్రజలు గుండెలు చీల్చుకుని పవన్ ను ప్రతిష్టించుకున్న ఏడాది 2024.

- మహా ప్రత్యేకం



### వారాహితో మమేకమై..

వారాహి యాత్రతో ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోనన్న మాటపై చివరివరకు నిలబడుతూ.. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు కుదరడంతో పవన్ కళ్యాణ్ కీలకపాత్ర పోషించారు. జనసేనకు తక్కువ సీట్ల కేటాయింపుపై ఎన్నో రకాల విమర్శలు వచ్చినా.. తాను పోటీచేసే అన్ని స్థానాల్లో గెలిచి సత్తా చాటడమే తన ముందున్న కర్తవ్యమంటూ ముందుకెళ్లారు. చివరకు పోటీచేసిన అన్ని స్థానాల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. వైసీపీని అద:పాతాళానికి తొక్కేస్తానని ఎన్నికల ప్రచారంలో శపథం చేసిన జనసేనాని దాన్ని చేసి చూపించారు

### వంద శాతం స్ట్రైక్ రేట్

ఈ ఏడాది రాజకీయరంగంలో జనసేనకు అద్భుతంగా కలిసొచ్చింది. ఎంతలా విజయాలు లభించాయంటే.. ఇక ఇంతకుమించి ఎవరు సాధిస్తారబ్బా అనేరీతిలో వందశాతం స్ట్రైక్ రేట్ తో దుమ్మురేపారు. సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన పార్టీగా జనసేన రికార్డు సృష్టిస్తే.. అంతకు ముందు ఎన్నికల్లో దక్కించుకున్న సీట్లలో పదో వంతు కూడా దక్కించుకోలేక వైసీపీ పూర్తిగా చతికిల పడింది . పోటీచేసిన అన్ని శాసనసభ, పార్లమెంట్ స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలుపొంది దేశం దృష్టిని ఆకర్షించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేసి నేషనల్ ఇమేజ్ సొంతం చేసుకున్న జనసేనాని ప్రధాని మోడీ ప్రశంసలు అందుకుంటూ పొలిటికల్ స్క్రీన్‌పై అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రత్యర్థుల ప్రశంసలు పొందే రాజకీయాలు చేస్తూ.. ఇదీ పవన్ అంటే అనిపిస్తున్నారు.

### కలిసొచ్చిన కాలం

జనసేనాని పవన్ కల్యాణ్ యువరాజ్యాధినేతగా తెలుగురాష్ట్రాల ప్రజల మనసులు చదివారు. రాష్ట్ర విభజన అనంతరం తానే జనసేన స్థాపించి వ్యూహాత్మక రాజకీయాలకు కేరాఫ్ గా మారారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేనకు, ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు బాగా కలిసొచ్చిన సంవత్సరం 2024ని . 2014లో పార్టీని పెట్టినప్పటికీ ఆ ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రచారం చేసిన పవన్‌కళ్యాణ్ పోటీకి దూరంగా ఉన్నారు. 2019లో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన జనసేన కేవలం ఒక సీటును మాత్రమే గెల్చుకుంది. జనసేనాని అయితే పోటీ చేసిన గాజువాక, భీమవరం రెండుచోట్ల ఓడిపోయారు. అదే జనసేన 2024లో పోటీచేసిన 21 శాసనసభ, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపొంది వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించింది. 2024 ఎన్నికల తర్వాత జనసేన పార్టీ ఉండదని, పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారంటూ ఎంతోమంది ఎన్నో విమర్శలు చేసినా ఆయన పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు. ఏవిధమైన వ్యూహాలతో ముందుకెళ్లాలో సరిగ్గా అంచనా వేయగలిగారు. అప్పటి అధికారపక్షం వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా వెనక్కి తగ్గలేదు.. ప్రతి విమర్శకు ధీటైన జవాబు ఇస్తూ ముందుకుసాగారు.

## సనాతన ధర్మ పరిరక్షణ బ్రాండ్ అంబాసిడర్

ఏపీలో సనాతన ధర్మ పరిరక్షణ బ్రాండ్ అంబాసిడర్‌గా పవన్ కళ్యాణ్ గుర్తింపు పొందారు. ఇతర మతాలను గౌరవిస్తూనే సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరాన్ని ధైర్యంగా చెప్పారు. దేశ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణకు అవసరమైతే తాను నాయకత్వం వహిస్తానని రీతిలో పవన్ కళ్యాణ్ తీరు కనిపిస్తోంది. దీంతో యావత్తు దేశ ప్రజల దృష్టిని పవన్ కళ్యాణ్ తనవైపు తిప్పుకున్నారు.మహారాష్ట్ర ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షించాయి.

పవన్ కళ్యాణ్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి కూటమి మంచి ప్రదర్శన కనబర్చింది. దీంతో పవన్ కళ్యాణ్ ఇమేజ్ తెలుగు రాష్ట్రాలు దాటి జాతీయస్థాయికి వెళ్లింది. అప్పటినుంచి పవన్ కళ్యాణ్ నేషనల్ లీడర్ అంటూ జనసైనికులు నినాదాలు హోరెత్తిస్తున్నారు. మరోవైపు ఎన్డీయే సమావేశాల్లో పవన్ కళ్యాణ్‌ను ప్రధాని మోడీ ప్రశంసలతో ముంచెత్తడం ఆయన ఇమేజ్‌ను దేశ స్థాయిలో మరింత పెంచింది. జనసేనాని ఎక్కడకు వెళ్లినా సీఎం సీఎం అంటూ జనసైనికులు హోరెత్తిస్తున్నారు. ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో పవన్ కళ్యాణ్ పర్యటించినప్పుడు అలా నినాదాలు చేస్తున్న అభిమానులను ఆయన వారించారు. అలా చేయవద్దని తానే ఇలా చేయిస్తున్నానని అనుకుని అవకాశం ఉందని, ఏపీకి ఎంతో అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారని... ఆయనను మనమందరం గౌరవించాలంటూ తన రాజకీయ పరిణతి ప్రదర్శించారు. అంతకు ముందు కూడా వచ్చే ఎన్నికల్లో కూడా కూటమే గెలుస్తుందని, చంద్రబాబే ముఖ్యమంత్రి అవుతారని ఆయన వ్యాఖ్యానించి చంద్రబాబు అనుభవం పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకోవడం విశేషం. మొత్తమ్మీద 2024 సంవత్సరం పవన్‌కళ్యాణ్‌కు గోల్డెన్ ఇయర్ గా చెప్పుకోవచ్చు. 2014లో పార్టీ పెట్టినప్పటి నుంచి 2023 వరకు పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎలాంటి విజయాలను చూడలేదు. కానీ 2024లో అన్నింటి లెక్కలు ఒక్కసారే తేల్చేశాడు. చరిత్ర ఎరుగని విజయాలు అందుకున్నారు. పాలనలో పరిణతి ప్రదర్శిస్తూ ప్రజలకు తనలోని కొత్త కోణం ఆవిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. అందుకే 2024ని పవన్ నామ సంవత్సరమంటూ.. జనసైనికులే కాదు రాజకీయ అభిమానులు కూడా సంబురాల్లో మునిగిపోయారు. 2024 జనసేన కాలం. జనసేన ద్వారా ముగ్గురికి మంత్రి యోగం దక్కింది. 2025లో నాగబాబు కూడా మంత్రి కానున్నారు. జనసేనాని అన్నయ్యకిచ్చే అపురూప బహుమతి ఇదే. ప్రజలంటే ప్రేమ పెంచుకున్న జనసేనాని జైత్రయాత్రకు వేదికగా 2024 నిలిచింది.

### శక్తిగా మారిన జనసేన

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ముందు వరకు జనసేన ఓ రాజకీయపార్టీ.. ఎన్నికల తర్వాత ఆపార్టీ ఓ శక్తిగా మారింది. పవర్ ఉంటే ఏదైనా చెయ్యెచ్చు.. జనసేన లక్ష్యం చేరుకోవాలంటే పవర్ కావాలంటూ పవన్ కళ్యాణ్ పదేపదే వ్యాఖ్యానించేవారు. సరిగ్గా 2024 ఎన్నికల తర్వాత ఏపీ ప్రభుత్వంలో జనసేన భాగస్వామిగా మారింది. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పవన్ కళ్యాణ్ మర్చిపోలేదు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా తాను ప్రజా సేవకుడినేనంటూ ముందుకు సాగారు. ప్రభుత్వ పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఎక్కడా తొందరపాటు చూపించకుండా.. నిదానంగా ముందుకెళ్తూ.. అందుబాటులో ఉన్న వనరులతో ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ప్రణాళికలు రచించుకుంటూ ముందుకెళ్తున్నారు. తనకు ఇష్టమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలను నిర్వర్తిస్తూ.. రాష్ట్రంలో తనదైన మార్క్ పాలనను ప్రజలకు చూపించేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏదైనా రాజకీయపార్టీ మత విశ్వాసాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. తమది సెక్యులర్ పార్టీ అని అన్ని మతాలను సమానంగా చూస్తామని ప్రచారం చేసుకుంటారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ మాత్రం సనాతన ధర్మాన్ని రక్షించుకోవల్సిన అవసరం ఉందని, తమ పార్టీ సనాతన ధర్మ పరిరక్షణకు కృషిచేస్తుందని బహిరంగంగా ప్రకటించడంతో పాటు తిరుపతిలో ఓ సభ ఏర్పాటుచేసి డిక్లరేషన్ ప్రకటించారు.

మహా ప్రత్యేకం

# రైతు బజార్ వద్ద రోడ్డు ప్రక్కన విక్రయాలు బంద్

### ట్రాఫిక్ ఇబ్బందులెదురవుతున్నాయన్న పోలీసులు



**ఆదిలాబాద్, మహా:** రైతు బజార్ ఎదుట ఎవరూ కూడా విక్రయాలు సాగించవద్దని, విక్రయాల వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అయిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ సూచించారు. ఆరు బయట కూరగాయాలు, ఇతర అమ్మకాలు చేపట్టడంతో లోపల తమకు గిరాకీ దెబ్బతింటోందని, పైగా రోడ్డుపై వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని అందిన ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. రైతు బజార్ ఎదుట తోపుడు బండ్లు పెట్టుకుని విక్రయాలు సాగిస్తున్న చిరు వ్యాపారులను అక్కడి నుండి లోపలికి తరలించారు. ఇకనుండి బయట అమ్మకాలు జరపవద్దని, రైతు బజార్ లోపలే కూర్చుని తమ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యానే ఈ చర్యలు చేపట్టినట్టు సీఐ స్పష్టం చేశారు.

# గజ.. గజ... తీవ్రంగా పెరగనున్న చలి

**హైదరాబాద్, మహా :** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే అది వాయుగుండంగా మారి వర్షాలు కురవడం సాధారణంగా జరుగుతుంటుంది. అందుకు ఎక్కువ కారణం నైరుతి రుతుపవనాలు. అయితే ప్రస్తుతం ఈ రుతుపవనాల వల్ల వారం రోజులుగా తెలంగాణ రాష్ట్రాన్ని మేఘాలు కమ్మేశాయి. బంగాళాఖాతంలో గంటకు 31 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. ఆ ప్రభావం తెలంగాణలో ఉంది. ఇక్కడ గంటకు 10 కిలోమీటర్ల వేగంతో చలి గాలులు వీస్తున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత అధికంగా పెరగబోతోందని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. కొన్నిరోజులుగా రాష్ట్రంలో పొగమంచు ఎక్కువగా ఉంది. ఇప్పుడు చలితీవ్రత కూడా పెరిగితే మంచు అధికమయ్యే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం 50 పగటివేళ ఎండ ఎక్కువగా ఉండటం, రాత్రివేళ చలి ఎక్కువగా ఉండటం జరుగుతుందని అధికారులు తెలిపారు. పగలు ప్రస్తుతం 29 డిగ్రీలు నమోదవుతుండగా, రాత్రివేళ 19 డిగ్రీలు నమోదవుతోంది. వర్షాలకు సంబంధించి ఎటువంటి హెచ్చరికలు లేకపోయినప్పటికీ గాలిలో తేమ శాతం మాత్రం 40 నుంచి 50 వరకు ఉంటోందని




అధికారులు పేర్కొన్నారు. ప్రజలు చలి బారిన పడకుండా ఉండేందుకు అనేక రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీలంక తూర్పువైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడబోతోందని, దీంతో చలిగాలులన్నీ అటువైపు మళ్లే అవకాశం ఉందన్నారు.

పగటివేళ ఎండ వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరు ఆ ఎండలో కనీసం 10 నిముషాలు ఉండాలని, వాకింగ్ చేయాలని, ప్రతి ఒక్కరు గోరువెచ్చిన నీరు తాగాలని, జలుబు, దగ్గు లాంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో జలుబు ప్రారంభమైన తర్వాత అది న్యూమోనియా, ఫ్లూ లాంటివాటికి దారితీస్తాయని, ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి దగ్గు ఎక్కువవుతుందని, 65 సంవత్సరాల వయసు దాటినవారు, రెండు సంవత్సరాల్లోపు చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఆస్తమా, గుండెజబ్బులతోపాటు కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఎంతో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా చిన్న చిన్న ఇబ్బందులు తలెత్తినట్లు అనిపించినా వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని వాతావరణశాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు.

# డిజిటల్ కంటెంట్‌తో మెరుగైన బోధన

### సీడీని ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మహా:** ప్రభుత్వ విద్యా కేంద్రాల్లోనూ డిజిటల్ మాధ్యమాలు అందుబాటులోకి వచ్చాయని, వాటితో బోధన చేస్తే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపకరించేలా వృక్షశాస్త్ర అధ్యాపకుడు గౌస్కుల సత్యనారాయణ రూపొందించిన ఉచిత డిజిటల్ కంటెంట్‌ను కలెక్టర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరానికి సంబంధించిన అధ్యాయాలను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలు, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థుల కోసం ఇంగ్లీష్ మీడియంలో రూపొందించిన కంటెంట్ ఇటు బోర్డు పరీక్షలతోపాటు అటు నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా తయారు చేసినట్లు రూపకర్త సత్యనారాయణ తెలిపారు. సీడీ, లింక్, క్యూ ఆర్ కోడ్ ద్వారా ఉచితంగా ఈ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, కేజీబీవీ జిల్లా ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఆరోగ్య పాఠశాల సంధానకర్త అజయ్, ప్రిన్సిపల్ లుందే రాము పాల్గొన్నారు.

# అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగంపై దాడిలో భాగమే

### సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్




**ఆదిలాబాద్, మహా:** అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణిస్తున్నామంటూ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక బాశెట్టి మాధవ రావు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎంతోపాటు వివిధ లౌకిక ప్రజాస్వామిక రాజకీయ పార్టీలు, ప్రజా, సామాజిక సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిండు పార్లమెంటు సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. బాబా సాహెబ్ అంబేద్కర్ ను అవమానపరచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనుస్మృతిని తీసుకు రావాలన్న ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగమేనని రవి కుమార్ అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు అనేకసార్లు భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ మాట్లాడారన్నారు. అంబేద్కర్ లౌకికవాది కావడమే బీజేపీ దృష్టిలో నేరం అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశాన్ని అగ్రవర్ణ ఆధిపత్య హిందూ రాజ్యంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రను మెజార్టీ దేశ ప్రజలు సహించబోరన్నారు. అనంతరం భారత రాజ్యాంగ పరిరక్షణ ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నంది రామయ్య, నాయకులు జగన్ సింగ్, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బి .వెంకట్ నారాయణ, అంబేద్కర్ సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి దర్శనాల నాగేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, పట్టణ నాయకులు ఆర్ సురేందర్, ఐద్వా నాయకులు లంక జమున, ఆర్. మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్. స్వామి, కె. ఆశన్న, గిరిజన సంఘం నాయకులు ఆత్రం కిష్టన్న, ఉయికే విష్ణు, ముఖినిపెల్లి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రిల్స్ లో ఇరుక్కున్న బాలుడి తల

- చాకచక్యంగా తీసిన భక్తులు
- ఊపిరి పీల్చుకున్న ఆలయ సిబ్బంది, భక్తులు



**యాదాద్రి, మహా :** యాదగిరిగుట్టపై ఓ బాలుడికి ప్రమాదం తప్పింది, దర్శనార్థం క్యూ లైన్ కోసం ఏర్పాటు చేసిన గ్రిల్స్ మధ్య ఇరుక్కున్న బాలుడి తలను భక్తులు చాకచక్యంగా బయటికి తీశారు. బాలుడి చేసిన పనికి తల్లిదండ్రులే కాదు క్యూలైన్‌లో నిలబడి దేవుడి దర్శనానికి వచ్చిన భక్తులు సైతం భయాందోళనకు గురయ్యారు. హైదరాబాద్ బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న ఓ కుటుంబం నిన్న రాత్రి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి శీఘ్ర దర్శనం కోసం పయనమయ్యారు. ఆదివారం కావడంతో స్వామి దర్శనానికి భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం ప్రత్యేక క్యూ లైన్ లో వేచి ఉన్న సమయంలో బాలుడు పక్కనే వున్న రెండు గ్రిల్స్ మధ్య తల పెట్టాడు. అంతే ఎంతకూ తల బయటకు రాకపోవడంతో బాలుడు కేకలు వేశాడు. గుర్తించిన తల్లి దండ్రులు బాలుడి తలను గ్రిల్స్ నుంచి బయటకు తీయడానికి నానా తంటాలు పడ్డారు. అయితే అక్కడే వున్న కొందరు అయ్యప్ప మాల ధరించిన స్వాములు బాలుడి తలను చాకచక్యంగా బయటకు తీశారు. బాలుడికి గాయాలు ఏమీ కాకపోవడంతో తల్లిదండ్రులు, దర్శనానికి వచ్చిన భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. చిన్న పిల్లలతో వచ్చిన కుటుంబ సభ్యులు జాగ్రత్తగా ఉండాలని ఆలయ అధికారులు సూచించారు.

# పదేళ్ళు బీఆర్ఎస్ బీసీలకు చేసిందేమీ లేదు

- జైలుకు వెళ్ళి వచ్చినా కవిత మారలేదు
- తప్పుడు పనులకు శిక్ష ఖాయం
- సంగారెడ్డి లో బీజేపీ ఎంపీ రఘునందన్



**సంగారెడ్డి, మహా :** రాష్ట్రంలో పదేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలకు చేసిందేమీ లేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. బీసీలకు ఏదో నష్టం జరుగుతుంది, దాన్ని సవరించాలటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతున్న తీరును రఘునందన్ రావు తప్పుపట్టారు. పదేళ్ళ మంత్రివర్గంలో బీసీలకు బీఆర్ఎస్ ఏ మాత్రం ప్రాధాన్యత ఇచ్చిందో అందరికీ తెలుసన్నారు. బీసీ బిడ్డ ఈటల రాజేందర్ ఎదుగుతున్నారన్న అక్కసుతో ఆయనను బయటకు పంపించింది ఏవరో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్రానికి దరిద్రం పట్టుకుందని, ఆ దరిద్రం కేవలం బీఆర్ఎస్ లోని ముగ్గురితోనేనని రఘునందన్ రావు ఘాటుగా వ్యాఖ్యానించారు. తప్పుడు పనులకు జైలు శిక్ష పడుతుందని, తామేదో తప్పు చేయలేదన్నట్లు కవిత మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తీహార్ జైలు కు వెళ్ళివచ్చినా కవిత మారలేదన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారం లో ఆర్బీఐ అనుమతి లేకుండా కేటీఆర్ దేశ సొమ్మును విదేశాలకు పంపారన్నారు. కేటీఆర్ విషయంలో ఈడీ తన పని తాను చేస్తుందన్నారు. బీఆర్ఎస్ చచ్చిన పాము, వాళ్ళ గురించి బీజేపీ మాట్లాడదని అంటూనే పదేళ్లు అధికారం లో ఉండి బిఆర్ఎస్ బీసీలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించతారు. 10 మంత్రి పదవులు బీసీ లకు ఇవాల్సి ఉన్నా చేసిందేంటో తెలవదా అని నిలదీశారు. అసెంబ్లీ లో మాట్లాడేందుకు బీసీలే లేరన్నట్లు సమస్యలన్నింటిపై కేటీఆర్, హరీష్లే మాట్లాడుతున్నారన్నారు. గతం మరిచి ఎక్కువగా మాట్లాడితే బీఆర్ఎస్ ను ప్రజలు బండకేసి కొడతారన్నారు. కవిత ఎక్కువగా ఎగిరిపడొద్దని, బోల్తా పడతారని హెచ్చరించారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు అఖిలపక్షనేతల సంఘీభావం




**ఆదిలాబాద్, మహా:** సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటం రాజ్యాంగ, న్యాయబద్ధమైనదని అఖిలపక్ష నాయకులు అన్నారు. గత కొద్ది రోజులుగా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు కొనసాగిస్తున్న సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలు కావని.. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష ఆధ్వర్యంలో ఉద్యోగులకు మద్దతుగా సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు బండి దత్తాద్రి, విజ్జగిరి నారాయణ, దర్శనాల మల్లేష్, వెంకట్, నారాయణ, మునిగెల నరసింహులు, నందిరామయ్య, సిర్ర దేవేందర్, పి రవీందర్ ప్రియాంక, పార్థసారథి, రవి, వెంకటి, కేశవ్, ప్రశాంత్ రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

# మందమర్రిలో ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు



మంచిర్యాల, మహా: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాలను మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్యాలయం ముందు సీపీఐ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్, ఏఐటీయూసీ నాయకులు శైలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ లో 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించిందని శత వార్షికోత్సవాలను ఏడాది పాటు నిర్వహించాలన్న కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీపీఐ నిరంతరం పేద ప్రజల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. దున్నే వానికే భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. ఎందరో కమ్యూనిస్టు యోధులు పార్టీ కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని గుర్తుచేశారు. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం ఎన్నో పోరాటాలు కొనసాగించారని తెలిపారు. త్యాగాలు, పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని అన్నారు. దేశంలో పేదరికం ఉన్నంతవరకు కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా పోరాడుతునే ఉంటుందని అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. దేశంలో అవినీతి పెరిగిపోయిందని, దీనిని రూపుమాపాలంటే ఈ దేశంలో ఉన్న 30 శాతం యువత ముందుకొచ్చి కమ్యూనిస్టు పార్టీ చేరాలని కోరారు. మందమర్రిలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూములు ఇప్పించిన అమరజీవి వీటీ అబ్రహం సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# మాలలంతా సంఘటితం కావాలి

### చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పిలుపు



**ఆదిలాబాద్, మహా:** మాలలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేసినప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకోగలుగుతామని, మాలలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల కోసం ఉద్యమించాలని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డులో గల మాల సంక్షేమ సంఘ భవనం ఆవరణలో ఆదివారం నిర్వహించిన మాలల భవిష్యత్తు కార్యాచరణ జిల్లా స్థాయి విస్తృత సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాలలకు సంబంధించి పలు యూనియన్ల ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎన్నో ఆందోళనలు, ఉద్యమాలు జరిగాయన్నారు. కానీ, గమ్యాన్ని మాత్రం చేరుకోలేకపోయాయన్నారు. అందుకు కారణం మనలో ఐక్యత లేకపోవడమే ప్రధాన కారణమని అన్నారు. అందరూ ఒకేతాటి మీదకు వచ్చి పోరాడినప్పుడే మనం అనుకున్న గోల్‌ను సాధిస్తామని, ఈర్ష్య, ద్వేషాలు వీడి అందరూ కలిసిరావాలని ఆకాంక్షించారు. పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధం అయ్యారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, వ్యవస్థాపక అధ్యక్షులు బేరా దేవన్న, నాయకులు సింగారి అశోక్, బబ్బిలి సుధాకర్, గంపల ప్రభాకర్, ముల్కల రాజేశ్వర్, ఎరా సుదీర్, పాశం రాఘవేంద్ర, నల్ల రాజేశ్వర్, మలపతి సుభాష్, బోండ్ల వెంకటస్వామి, మల్లెల అశోక్, మాదాసు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని అనుమతులున్నాయి

- ఆ రెండు రోజులు థియేటర్ ను మైత్రీ మూవీస్ లీజుకు తీసుకుంది
- గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటన చోటు చేసుకోలే
- గతంలో ఛాలా మంది హీరోలు థియేటర్ కు వచ్చారు
- పోలీసుల నోటీసులకు రిప్లై ఇచ్చిన సంధ్య థియేటర్ యాజమాన్యం




**హైదరాబాద్, మహా :** పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై ఎట్టకేలకు థియేటర్ యాజమాన్యం స్పందించింది. చిక్కడపల్లి పోలీసులు జారీ చేసిన షోకాజ్ నోటీసులకు రిప్లై ఇచ్చింది. 6 పేజీల లేఖను న్యాయవాదుల ద్వారా పోలీసులకు థియేటర్ యాజమాన్యం పంపించింది. సంధ్య థియేటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని థియేటర్ యాజమాన్యం స్పష్టం చేసింది. గత 45 ఏళ్లుగా థియేటర్ రన్ చేస్తున్నామని.. గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్‌లో 80 మంది స్టాఫ్ విధుల్లో ఉన్నట్లు థియేటర్ యాజమాన్యం తన రిప్లైలో పేర్కొంది. 4, 5 తేదీల్లో థియేటర్‌ను మైత్రి మూవీస్ ఎంగేజ్ చేసుకుందన్నారు. గతంలో అనేక సినిమాల రిలీజ్ సందర్భంగా హీరోలు థియేటర్‌లో సినిమాలకు వచ్చారన్నారు. ఇకపోతే సంధ్య థియేటర్‌లో ఫోర్ వీలర్స్, టూ వీలర్స్‌కి ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కూడా ఉందని ఈ రిప్లైలో థియేటర్ యాజమాన్యం స్పష్టం చేసింది.

పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో డిసెంబర్ 4వ తేదీన రిలీజైన విషయం తెలిసిందే. ఈ సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌కు హీరో అల్లు అర్జున్ ఫ్యామిలీతో సహా వచ్చారు. హీరోయిన్, మిగతా చిత్ర బృందం కూడా థియేటర్‌కు వచ్చింది. సెలబ్రిటీస్‌ను చూడటానికి అభిమానులు పోటెత్తడంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా ఆమె కొడుకు శ్రీతేజ్ స్పృహ తప్పి పడిపోయాడు. బ్రెయిన్‌కి ఆక్సిజన్ అందకపోవడంతో కోమాలోకి వెళ్లాడు. ప్రస్తుతం శ్రీతేజ్‌కు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న పోలీసులు హీరో అల్లు అర్జున్ ను అరెస్టు చేయడంతో పాటు ఘటన సందర్భంగా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న ఆరోపణపై థియేటర్ లైసెన్సును ఎందుకు రద్దు చేయకూడదంటూ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు యాజమాన్యం సుదీర్ఘ సమాధానం ఇచ్చింది. సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన ఏజెన్సీతో పాటు గతంలో థియేటర్ కు వచ్చిన హీరోలు, సెలబ్రిటీలకు సంబంధించిన వివరాలను లేఖలో యాజమాన్యం పొందుపరిచింది.

# న్యూ ఇయర్ వేడుకల్లో యువత జాగ్రత్త వహించాలి

### గాంజా, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి- సీఐ మధు



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 29, మహా:** నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం, మంచాల ప్రజలకు సీఐ మధు సూచించారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దన్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రిసార్ట్ లలో ఈవెంట్లు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేకుండా ఈవెంట్లు నిర్వహించే రిసార్టులపై, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గాంజా, డ్రగ్స్ వంటివి సేవిస్తూ పట్టుబడినట్టయితే వారిపై కఠినతరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# అడవి జంతువులను వేటాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

### అడవి పందులు, కోడి పుంజు మాంసం స్వాధీనం





**ములుగు, మహా :** అడవి జంతువులను వేటాడి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రేంజ్ అధికారి డోలు శంకర్ వెల్లడించారు. పెద్దపులి అడుగుజాడల కోసం ములుగు మండలం పత్తిపల్లి మాన్ సింగ్ తండా మార్గమధ్యంలో పరిశీలిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తారసపడ్డారని, వారిని తనిఖీ చేస్తుండగా పట్టుపడ్డాడని తెలిపారు. అతని వద్ద ఉన్న సంచిలో పరిశీలించగా అడవిపంది మాంసం లభ్యమైనదని వెల్లడించారు. మరో ఇద్దరు వ్యక్తులు సైకిల్ పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించగా వారినీ పరిశీలించగా ఒక సంచిలో అడవి కోడిపుంజు లభ్యమైందని పేర్కొన్నారు. వారు ఇరువురూ బంజరుపల్లి గ్రామానికి చెందిన దాసరి సమ్మయ్య, వనం రాజేష్‌లుగా గుర్తించామని, ముగ్గురిని విచారణ నిమిత్తం ములుగు రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ అధికారి తెలిపారు. అదేవిధంగా ములుగు మండలం మేడివాగు సమీపంలో అడవి పందులను చంపి కాల్చుతున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేరగా మూడు చనిపోయిన అడవి పందులు లభ్యమయ్యాయని రేంజర్ వెల్లడించారు. అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా బంజరపల్లి గ్రామానికి చెందిన సారయ్య, నగేష్, సాయి, రామయ్య, నాగన్నలుగా గుర్తించామన్నారు. ఎనిమిది మందిపై వైల్డ్ లైఫ్ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ యాకూబ్ జానీ, బీట్ ఆఫీసర్లు శ్యాంసుందర్, శివకృష్ణ, భద్రు కిషన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ నూతన సీఎస్‌గా విజయానంద్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. నేటితో ముగియనున్న నీరబ్ పదవీ కాలం



**ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ప్రస్తుత సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో నూతన సీఎస్ గా విజయానంద్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. విజయానంద్ ప్రస్తుతం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రేపు మధ్యాహ్నం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది నవంబర్ నెలలో విజయానంద్ పదవీ విరమణ చేయనున్నారు.

## నింగిలోకి దూసుకెళ్లనున్న పీఎస్ఎల్వీ సీ-60 రాకెట్

### మరికొద్ది గంటల్లో కౌంట్‌డౌన్ షురూ



ఏపీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమయ్యింది. నేడు మరో రాకెట్ ను ప్రయోగించనున్నది. మరికొద్ది గంటల్లో పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్ ప్రయోగం కోసం కౌంట్‌డౌన్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి రాత్రి 9.58 గంటలకు ఈ రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ రాత్రి బెంగళూరు నుంచి షార్‌కు చేరుకుంటారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్వీ కోర్ అలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. రేపు నింగికేగనున్న పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

స్ట్రాపాన్ బూస్టర్లను ఉపయోగించకపోవడంతో ఈ రాకెట్ బరువు 229 టన్నులుగా ఉంటుందని వారు తెలిపారు. రాకెట్‌లో రెండో దశకు ద్రవ ఇంధనం, మూడో దశకు ఘన ఇంధనం, నాలుగో దశకు ద్రవ ఇంధనాన్ని వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని.. ఛేజర్, టార్గెట్ అనే పేర్లు వాటికి నామకరణం చేశామన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

## టీ బ్యాగ్‌లతో శరీరంలోకి మైక్రో ప్లాస్టిక్‌లు

**బార్సిలోనా:** టీ బ్యాగ్‌లతో టీ తాగడం చాలా సౌకర్యంగా, రుచికరంగా ఉంటుంది. అయితే, వీటి వల్ల లక్షల సంఖ్యలో మైక్రో, నానోప్లాస్టిక్స్ శరీరంలోకి వెళ్తున్నట్టు స్పెయిన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. అటానమస్ యూనివర్సిటీ ఆఫ్ బార్సిలోనాకు చెందిన పరిశోధకులు నైలాన్-6, పాలిప్రోపిలీన్, సెల్యూలోస్ అనే పాలిమర్ల నుంచి చేసిన టీ బ్యాగులపై అధ్యయనం జరపగా వీటితో టీ కలుపుకునేటప్పుడు పెద సంఖ్యలో మైక్రో, నానోప్లాస్టిక్స్ విడుదలవుతున్నట్లు గుర్తించారు. టీ కలిపేటప్పుడు నైలాన్-6 మిల్లీలీటర్‌కు 81.8 లక్షల కణాలను, పాలిప్రోపిలీన్ 120 కోట్ల కణాలను, సెల్యూలోస్ 13.5 కోట్ల కణాలను విడుదల చేస్తున్నట్టు చెప్పారు.



## ఎల్ఏసీ సమీపంలో శివాజీ విగ్రహం

### ఆవిష్కరించిన భారత సైన్యం



**ఢిల్లీ:** తూర్పు లడఖ్ సెక్టర్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని భారత సైన్యం ఆవిష్కరించింది. పాంగాంగ్ సో సరస్సు తీరంలో, సముద్ర మట్టానికి 14,300 అడుగుల ఎత్తులో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. లెఫ్టినెంట్ జనరల్ హితేష్ భల్లా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ ఔన్నత్యం నిరంతరం స్ఫూర్తిదాయకమని లేహ్‌లోని 14 కోర్ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ధైర్యసాహసాలు, ముందుచూపు, చెక్కు చెదరని న్యాయాలకు ప్రతీక శివాజీ అంటూ కొనియాడారు. ఇదిలా ఉంటే, ఇటీవల చిట్టచివరి ఘర్షణ ప్రాంతాలైన దెమ్‌చోక్, డెప్సాంగ్‌ల నుంచి భారత్, చైనా తమ సైన్యాలను ఉపసంహరించాయి. దీంతో దాదాపు నాలుగున్నరేళ్ల నుంచి ఇరు దేశాల మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణానికి తెర పడినట్లయింది.

## ఇది అవమానించడం కాకపోతే ఇంకేమిటి..?

- మన్మోహన్ సింగ్ అంత్యక్రియల విషయమై రాహుల్ సీరియస్
- వాజపేయి అంత్యక్రియల నాటి ఫుటేజ్‌ను షేర్ చేసిన ప్రియాంక
- మాజీ ప్రధానులను గౌరవించే సాంప్రదాయాన్ని కొనసాగించాలి -అఖిలేశ్



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా సీరియస్ అయ్యారు. గతంలో అంత్యక్రియలకు ఇతరులకు ప్రత్యేక స్మశాన స్థలాలను ఇచ్చిన విషయాలను ఆయన గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆ విధానాన్ని అనుసరిస్తలేదంటూ మండిపడ్డారు. కేంద్రం తీరు మాజీ ప్రధాని, సిక్కు జాతిని పూర్తిగా అవమానపర్చడమేనని ఆయన పేర్కొన్నారు. మన్మోహన్ అంత్యక్రియల విషయంలో రాజకీయాలకు, సంకుచిత భావాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించలేదని ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని వాజపేయి అంత్యక్రియల నాటి ఫుటేజ్‌ను షేర్ చేస్తూ మన్మోహన్ సింగ్ విషయంలో కేంద్రం వైఖరిని ఆమె తప్పుబట్టారు. అదేవిధంగా సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సైతం కేంద్ర ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు. దేశ మాజీ ప్రధానులను గౌరవించే సంస్కృతిని కొనసాగించాలంటూ ప్రధాని మోదీకి హితవు పలికారు. కాంగ్రెస్ పై బీజేపీ ఆగ్రహం బతికి ఉన్నప్పుడు ఎన్నడు కూడా మన్మోహన్ సింగ్‌ను గౌరవించని కాంగ్రెస్ ఇప్పుడు ఆయన మరణాంతరం రాజకీయాలు చేస్తున్నదంటూ బీజేపీ సీనియర్ నేత సుధాంశు త్రివేది ఎద్దేవా చేశారు. మాజీ ప్రధానులు లాల్ బహదూర్ శాస్త్రీ, పీవీ నరసింహారావులు సహా గాంధీయేతర నేతలెవ్వరికీ కాంగ్రెస్ గౌరవాన్ని ఇవ్వలేదని ఆరోపించారు. అదేవిదంగా బీజేపీ నేత సీఆర్ కేశవన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా కాంగ్రెస్ అడ్డుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ముందుగా దీనిపై సమాధానం చెప్పాలంటూ సీరియస్ అయ్యారు.

## మాజీ కానిస్టేబుల్ ఇంట్లో రూ. 14 కోట్ల నగదు

### రూ. 40 కోట్ల బంగారం, అనేక పత్రాలు లభ్యం



**భోపాల్:** మధ్యప్రదేశ్ రవాణా శాఖకు చెందిన ఓ మాజీ కానిస్టేబుల్ నివాసాలలో దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో దాదాపు రూ.14 కోట్ల నగదు, రూ.40 కోట్ల విలువైన బంగారం, రూ. 2 కోట్ల విలువైన వెండి, రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించిన అనేక పత్రాలు లభించాయి. మాజీ కానిస్టేబుల్ సౌరభ్ శర్మ ఇంటిపై గతవారం లోకాయుక్త మొదటిసారి దాడి జరపగా రూ. 2.87 కోట్ల నగదు, 275 గ్రాముల వెండితో సహా రూ.7.98 కోట్ల చరాస్తులు లభించాయి. ఆదాయ పన్ను శాఖ మరోసారి దాడి జరపగా రూ. 40 కోట్ల విలువైన 52 కిలోల బంగారు బిస్కెట్లు, రూ. 11 కోట్లకు పైగా నగదు భోపాల్‌లో ఒక నిర్జన ప్రదేశంలో వదిలివేసిన కారులో లభించిన విషయం తెలిసిందే.

## బీపీఎస్సీ పరీక్ష రద్దు కోసం విద్యార్థుల ఆందోళన

### పోలీసు లాఠీ-చార్జీతో ఉద్రిక్తత



**బీహార్:** బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) నిర్వహించిన 70వ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ (సీసీఈ) తిరిగి నిర్వహించాలంటూ ఆ రాష్ట్ర అభ్యర్థులు ఆందోళన బాటపట్టారు. ఆదివారం వీరి ఆందోళన ఉద్రిక్తంగా మారింది. అయితే, పాట్నాలో ఆందోళనకారులను నిలువరించేందుకు వారిపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. నీటి ఫిరంగులు ప్రయోగించారు. తొలుత గాంధీ మైదాన్‌కు చేరుకున్న బీపీఎస్సీ అభ్యర్థులు జేపీ గోలంబార్ మీదుగా సీఎం నితీశ్ కుమార్ అధికారిక నివాసం వైపు ర్యాలీగా బయలుదేరారు. వీరి ప్రదర్శనకు పోలీసులు అనుమతించలేదు. దీంతో ఈ అంశంపై సీఎంతో భేటీకి ఆందోళన కారులు డిమాండ్ చేశారు. విద్యార్థుల పై పోలీసుల ప్రయోగాన్ని నిరసిస్తూ అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) శుక్రవారం చక్కా జామ్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ ఆందోళనలో జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కూడా పాల్గొన్నారు. జేపీ గోలంబర్ వద్ద మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినిపించేందుకు ఐదుగురు సభ్యుల ప్రతినిధి బృందాన్ని ప్రకటించారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిని కలిసేందుకు విద్యార్థులు నిరాకరించారు. గత పది రోజులుగా బీపీఎస్సీ అభ్యర్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రశ్నాపత్రం లీకైందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే బీపీఎస్సీ పరీక్ష నియంత్రణాధికారి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితుల్లోనూ పరీక్షను రద్దు చేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. ఏప్రిల్ నెలలో మెయిన్ పరీక్ష జరుగుతుందని, అందుకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు.

## నుమాయిష్ ప్రారంభం వాయిదా

### మాజీ ప్రధాని సంతాప దినాల నేపథ్యంలో వాయిదా

**జనవరి 3వ తేదీన ప్రారంభం**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జనవరి 1న ప్రారంభం కావాల్సిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) వాయిదా పడింది. మాజీ ప్రధాని సంతాప దినాల నేపథ్యంలో నుమాయిష్‌ను రెండు రోజులపాటు వాయిదా పడింది. జనవరి 3వ తేదీన నుమాయిష్ ప్రారంభం కానుంది. ప్రతి ఏడాది నుమాయిష్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం జనవరి 1న ఈ నుమాయిష్ ప్రారంభమై 46 రోజుల పాటు అంటే ఫిబ్రవరి 15 వరకు జరగాల్సి ఉంది. పారిశ్రామిక ప్రదర్శన కోసం దాదాపు 2500 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఇందుకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 1938లో నిజాం కాలంలో మొదలైన నుమాయిష్‌కు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి లభించిన నేపథ్యంలో ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తారు.

## 16 ఏళ్లకే 7 పర్వతాలను అధిరోహించిన బాలిక

### ప్రపంచ రికార్డుతో ప్రశంసలు



**ముంబై:** మహారాష్ట్రకు చెందిన కామ్యా కార్తికేయన్ అనే 16 ఏండ్ల బాలిక పర్వతారోహణలో ప్రపంచ రికార్డును సాధించింది. ఏడు ఖండాల వ్యాప్తంగా ఏడు అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలైన బాలికగా కామ్య చరిత్ర సృష్టించింది. ఏడు పర్వతాలను అధిరోహించే సవాల్‌ను స్వీకరించిన కామ్య మౌంట్ కిలిమంజారో(ఆఫ్రికా), మౌంట్ అకాన్‌కాగువా(దక్షిణ అమెరికా), మౌంట్ కాజీయాస్కో(ఆస్ట్రేలియా), మౌంట్ ఎల్‌బ్రస్(యూరపు), మౌంట్ డెనలి(ఉత్తర అమెరికా), మౌంట్ ఎవరెస్ట్(ఆసియా), మౌంట్ విన్సన్(అంటార్కటికా)లను విజయవంతంగా కామ్య విజయవంతంగా అధిరోహించింది. తన తండ్రి కమాండర్ కార్తికేయన్‌తో కలసి మౌంట్ విన్సన్ చేరుకున్న కామ్య ఈ నెల 24న సప్త పర్వాతాధిరోహణ సవాల్‌ను పూర్తి చేసింది. ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువం చేరుకోవడాన్ని తన తదుపరి లక్ష్యమని కామ్య పేర్కొంది. ఈ నేపథ్యంలో వారిద్దరినీ భారతీయ నేవీ ప్రత్యేకంగా అభినందించింది. ముంబైలోని నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో కామ్య ప్రస్తుతం విద్యనభ్యసిస్తుంది.

## జనవరి 13 నుంచి మహా కుంభమేళా



**యూపీ:** వచ్చే నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజులపాటు ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా జరుగనున్నది. ఈ కుంభమేళాకు 40 కోట్లమంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాగ్ రాజ్ లో జరిగే కుంభమేళాలో పాల్గొని అయోధ్యలోని రామ్ లల్లా ఆలయాన్ని కూడా భక్తులు సందర్శిస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అయోధ్య అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. భక్తుల భద్రత కోసం పారా మిలిటరీ బలగాలతోపాటు 50 వేల మంది సిబ్బందిని నియమించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో కూడిన 2700 కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. తొలిసారి అండర్ వాటర్ డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. కుంభమేళా సమాచారం తెలుసుకోవడానికి 11 భారతీయ భాషల్లో ఏఐ చాట్ బోట్‌లను కూడా ఏర్పాటు చేశారు. భక్తులకు తాత్కాలిక వసతి కల్పనకు వేల సంఖ్యలో టెంట్లు, షెల్టర్లతో మహా కుంభ్ నగర్ నిర్మిస్తున్నారు. దీన్ని గూగుల్ మ్యాప్ తోనూ అనుసంధానిస్తున్నారు. కుంభమేళాకు వచ్చిన భక్తులకు చికిత్స చేసేందుకు తాత్కాలిక దవాఖానలు కూడా ఏర్పాటు చేశారు. ఒకేసారి 200 మందికి చికిత్స అందించేందుకు వీలుగా బీష్మ క్యూబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక నేత్ర కుంభ్ శిబిరం ద్వారా 5 లక్షల మంది భక్తులకు కంటి పరీక్షలు నిర్వహించి మూడు లక్షలకు పైగా కండ్లద్దాలు పంపిణీకి చర్యలు చేపట్టారు. భక్తులు కుంభ మేళాలో ఆయా ప్రదేశాలకు వెళ్లేందుకు ఆంగ్లం, హిందీ, ప్రాంతీయ భాషల్లో 800 బోర్డులకు పైగా ఏర్పాటు చేస్తున్నారు. ఇక 92 రోడ్లు పునర్నిర్మిస్తున్నారు. 17 ప్రధాన రహదారుల సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అత్యాధునిక బహుళ విపత్తు నివారణ వాహనాలను మోహరిస్తున్నారు. సౌర విద్యుత్ తో లైటింగ్ వసతులు కల్పిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించారు.

## ఉత్తర గాజాలోని ఆస్పత్రిపై ఇజ్రాయెల్ దాడి



ఇజ్రాయెల్ రక్షణ దళాలు (IDF) ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై దాడి చేశాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఇజ్రాయెల్ దళాలు ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుని రోగులను అక్కడి నుంచి ఖాళీ చేయమని ఆదేశించాయి. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. ఇజ్రాయెల్ సైనికులు ఆస్పత్రి సిబ్బందిని, రోగులను వారి దుస్తులు తీసివేయమని హుకుం జారీచేశారు.

ఇజ్రాయెల్ బలగాల దాడిలో ఆస్పత్రిలోని కొన్ని భాగాలు నాశనమయ్యాయి. ఆస్పత్రి సర్జికల్ విభాగాలు, ల్యాబొరేటరీలు, ఎమర్జెన్సీ యూనిట్ మొత్తం కాలిపోయాయని ఆస్పత్రి అధికారులు చెప్పారు. దాంతో ఆస్పత్రిలో సేవలు నిలిచిపోయాయి. ఈ దాడి ప్రజల ఆరోగ్య సంరక్షణను తీవ్రంగా ప్రభావితం చేసింది. అయితే IDF ఈ ఆరోపణలను ఖండించింది. కమల్ అద్వాన్ ఆస్పత్రి హమాస్ గ్రూపు స్థావరంగా ఉపయోగించబడుతోందని, అక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయని పేర్కొంది.

నిఘా వేసిన తర్వాతే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే ఈ దాడికి, అగ్నిప్రమాదానికి ఎలాంటి సంబంధం లేదని IDF స్పష్టంచేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ దాడిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. WHO ప్రకారం ఈ దాడి ఉత్తర గాజాలోని చివరి ప్రధాన ఆరోగ్య సదుపాయంలో కూడా సేవలు అందుబాటులో లేకుండా చేసింది. దాడి సమయంలో ఆస్పత్రిలో 60 మంది ఆరోగ్య కార్యకర్తలు, 25 మంది క్రిటికల్ పరిస్థితిలో ఉన్న రోగులు చికిత్స పొందుతున్నారని WHO తెలిపింది.

## 20 అడుగులు గ్యాలరీపై నుంచి కింద పడిన ఎమ్మెల్యే

### తీవ్ర గాయలు కావడంతో ఆసుపత్రికి తరలింపు

### పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం




**కేరళ:** కేరళలో రాష్ట్రంలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. కొచీలోని జవహర్ లాల్ నెహ్రూ అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 20 అడుగుల ఎత్తున ఉన్న గ్యాలరీ పై నుంచి త్రిక్కకర కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమా థామస్ కిందపడ్డారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే వాలంటీర్లు, ఈవెంట్ నిర్వాహకులు చికిత్స కోసం ప్రయివేట్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఉమా థామస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మెదడు, వెన్నెముక, ఊపిరితిత్తులకు తీవ్ర గాయాలయ్యాయని, ప్రస్తుతం వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నామని వారు పేర్కొంటున్నారు. వేదికపైకి వెళుతుండగా ఉమా థామస్ బ్యాలెన్స్ తప్పి, గ్యాలరీ నుంచి కింద పడినప్పుడు ఆమె తల నేలను తాకిందని సమాచారం. ప్రస్తుతం ఉమా థామస్ కు ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని కేరళ మంత్రి పీ రాజీవ్ వెల్లడించారు. రాష్ట్ర సీఎం విజయన్, ఆరోగ్యశాఖ మంత్రితో సంప్రదించామన్నారు. వివిధ విభాగాల వైద్య నిపుణులతో ఆమెకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

## పాకిస్థాన్ పై తాలిబన్ల దాడులు

### నలుగురు మృతి

**ఇస్లామాబాద్:** ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ ప్రభుత్వ దళాలు పాకిస్థాన్ పై దాడులకు పాల్పడ్డాయి. పాక్ సరిహద్దు ప్రాంతంలోని కుర్రమ్‌పై శనివారం దాడులు చేశాయి. పాక్ ప్రతిస్పందిస్తూ ప్రతిదాడులు చేసింది. ఈ దాడుల్లో ముగ్గురు ఆఫ్ఘన్ సైనికులు, ఓ పాకిస్థానీ సైనికుడు మృతిచెందారు. తొమ్మిది మంది పాకిస్థానీలు గాయపడ్డారు. దండే పటన్‌కుర్రమ్ సరిహద్దు ప్రాంతంలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా పక్తియా సరిహద్దు ప్రాంతంలోనూ దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆఫ్ఘన్‌లోని ఖోస్ట్ ప్రజలు తమ ఇండ్లను వదిలివెళ్లిపోతున్నారు. పాకిస్థాన్ 24న అఫ్ఘన్‌పై దాడి చేసిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి.



## థాడ్‌తో మిస్సైల్ కూల్చివేత

**జెరూసలేం :** అమెరికా అందజేసిన క్షిపణి రక్షణ వ్యవస్థ 'థాడ్' (ద అమెరికన్ టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్)ను ఇజ్రాయెల్ మొదటిసారిగా ఉపయోగించింది. శనివారం యెమెన్‌లోని 'హౌతీ' తిరుగుబాటు దళాలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని 'థాడ్'తో అడ్డుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించి 'ఎక్స్'లో వీడియో విడుదలైంది. కాసేపటి తర్వాత..'థాడ్'ను ఉపయోగించినట్టు 'ఐడీఎఫ్' నిర్ధారించింది. ఇరాన్ క్షిపణి దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్ 'థాడ్'ను ఏర్పాటు చేసింది. స్వల్ప, మధ్య, మధ్యంతర శ్రేణి క్షిపణి దాడుల్ని అడ్డుకునేందుకు అమెరికా 'థాడ్' వ్యవస్థను అభివృద్ధి చేసింది. ప్రపంచవ్యాప్తంగా తమ మిత్ర దేశాలకు అందజేస్తున్నది. అణుబాంబు సహా శక్తివంతమైన బాంబులతో దూసుకొచ్చే క్షిపణుల్ని 870 నుంచి 3,000 కిలోమీటర్ల పరిధిలోనే 'థాడ్' రాడార్లు గుర్తిస్తాయి.

# రాజకీయ సుస్థిరత.. సమర్థ వృద్ధిరేటు..
## రియాల్టీలో పెరుగుతున్న సంస్థాగత పెట్టుబడులు..!

గతంతో పోలిస్తే రియాల్టీ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. సొంతిండ్లకు, గోదాములకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతన్నది. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ సంస్థల్లో సంస్థాగత పెట్టుబడులు క్రమంగా పుంజుకుంటున్నాయి. 2023తో పోలిస్తే దేశీయ రియాల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడులు 51 శాతం వృద్ధి చెందాయని ప్రముఖ రియాల్టీ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. 2023లో రియాల్టీ సంస్థల్లో సంస్థాగత ఇన్వెస్టర్లు 5.878 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడితే, ఈ ఏడాది 8.878 బిలియన్ డాలర్లకు పెరిగింది.

ఇక విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కూడా 63 శాతం పుంజుకున్నాయి. రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లోకి 45 శాతం, ఆఫీసు భవనాల నిర్మాణంలో 28 శాతం, గోదాముల నిర్మాణంలోకి 23 శాతం పెట్టుబడులు వచ్చి చేరాయి. 'రియాల్టీ రంగంలో 2024 ఒక మైలురాయిగా నిలువనున్నది. ఇన్వెస్టర్లకు రియాల్టీ సంస్థల మధ్య జరిగిన 78 ఒప్పందాల్లో రియల్ ఎస్టేట్ రంగంలోకి 8.9 బిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చి చేరాయి. 2007 తర్వాత రియాల్టీ రంగంలో రికార్డు స్థాయిలో సంస్థాగత పెట్టుబడులు రావడం ఇదే ప్రథమం. 2007లో రియాల్టీ రంగంలోకి 8.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చి చేరాయి. రియాల్టీ రంగ పెట్టుబడుల్లో ప్రధాన వాటా రెసిడెన్షియల్ సెగ్మెంట్‌దే.

2023తో పోలిస్తే ఆఫీసు భవనాల సెగ్మెంట్ పెట్టుబడులు మాత్రం 17 శాతం తగ్గుముఖం పట్టాయని జేఎల్ఎల్ ఇండియా పేర్కొంది. జేఎల్ఎల్ ఇండియా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ క్యాపిటల్ మార్కెట్స్ లతా పిళ్లై మాట్లాడుతూ.. 'సమర్థవంతమైన వృద్ధి, రాజకీయ సుస్థిరత వంటి కారణాలతో అంతర్జాతీయ ఆర్థిక రంగం నేపథ్యంలో భారత్‌లో వైవిధ్య భరితమైన పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. 2023 నుంచి దేశీయంగా రియాల్టీ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు 2024లోనూ కొనసా



గాయని గుర్తు చేశారు. 201922 మధ్య సగటున రియాల్టీ రంగంలో 19 శాతం సంస్థాగత పెట్టుబడులు ఉంటే, ఈ ఏడాది అది 37 శాతానికి పెరిగిందన్నారు.

## పది నిమిషాలకో లగ్జరీ కారు సేల్.. ప్రీమియం కార్లపై పెరుగుతున్న మోజు..!

కరోనా మహమ్మారి తర్వాత ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందునా స్పేసియస్‌గా ఉండే ఎస్‌యూవీ కార్లతోపాటు లగ్జరీ కార్ల పైనా మోజు పారేసుకుంటున్నారు. 2024లో ప్రతి గంటకు ఆరు రూ.50 లక్షలపై చిలుకు ధర గల లగ్జరీ కార్లు కొనుగోలు చేశారు. ఐదేండ్ల క్రితం గంటకు రెండు లగ్జరీ కార్లు మాత్రమే అమ్ముడయ్యేవి. సంపన్న వినియోగదారుల పునాది క్రమంగా పెరుగుతుండటంతో ప్రీమియం కార్లకు గిరాకీ పెరుగుతోంది. లగ్జరీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను గమనించిన కార్ల తయారీ సంస్థలు 2025లో రెండు డజన్లకు పైగా కొత్త మోడల్ కార్లను ఆవిష్కరించేందుకు సిద్ధం చేసుకుంటున్నాయి. బేస్ పెరుగుతున్నా కొద్దీ.. 50 వేల కార్లు అమ్ముడవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. లగ్జరీ కార్లలో ఒకటైన ఆడీ ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రీమియం కార్లకు గిరాకీ పెరిగిందన్నారు. 2025లో లగ్జరీ కార్ల మార్కెట్ 810 శాతం పెరుగుతుందని అంచనా వేశారు. మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ కం సీఈఓ సంతోష్ అయ్యర్ మాట్లాడుతూ స్థిరమైన ఆర్థిక ఫలితాలతోపాటు విని



యోగదారుల సానుకూల సెంటిమెంట్ వల్ల లగ్జరీ కార్ల మార్కెట్ పెరుగుతుందన్నారు. దేశీయంగా లగ్జరీ కార్ల విక్రయాల్లో మెర్సిడెజ్‌బెంజ్ ముందు వరుసలో నిలిచింది. 2024లో దాదాపు 20 వేల యూనిట్ల కార్లు అమ్ముడవుతాయని కంపెనీ యాజమాన్యం భావిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 13 శాతం వృద్ధిరేటు ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 14,379 యూనిట్లు అమ్ముడయ్యాయి. పెరుగుతున్న గిరాకికి అనుగుణంగా 2025లో కొత్త కార్ల ఆవిష్కరణతోపాటు మార్కెట్ విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఐదు శాతం సేల్స్ పెంచుకున్నది. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 10,556 కార్లు విక్రయించింది. ఆడి ఇండియా సేల్స్ 16 శాతం తగ్గాయి. సప్లయ్ చైన్‌లో ఇబ్బందుల వల్లే ఈ పరిస్థితి నెలకొందని, 2025లో రికవరీకి కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తామని ఆడి ఇండియా చెబుతోంది. గతేడాదితో పోలిస్తే లగ్జరీ కార్ల విక్రయాలు పెరిగినా.. మొత్తం కార్ల విక్రయాల్లో వీటి వాటా ఒక శాతం పై చిలుకే. ప్రధాన గ్లోబల్ ఎకానమీల్లో భారత్‌లో లగ్జరీ కార్ల విక్రయాలు తక్కువ.

## అదిరిపోయే లుక్‌లో మారుతి కొత్త కార్లు..
# 2025లో వచ్చేస్తున్నాయి

### 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

**న్యూఢిల్లీ :** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతో పాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి.

**వీటి వివరాలు..**

మారుతి ఈవిటారా:దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈవిటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు,ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదుఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.




# క్రీడా వార్తలు
SPORTS NEWS



# గవాస్కర్ కాళ్లు మొక్కిన నితీష్‌రెడ్డి తండ్రి..

భారత యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియా తో మెల్‌బోర్న్ టెస్టులో 8వ స్థానంలో వచ్చి అద్భుతమైన సెంచరీ చేయడంతో ఆయన తండ్రి ముత్యాల రెడ్డి ఎంతో ఎమోషనల్ అయ్యారు. మ్యాచ్ అనంతరం నితీష్ తండ్రి ముత్యాలరెడ్డి సునీల్ గవాస్కర్ కాళ్లు మొక్కారు. ఆ తర్వాత నితీష్ రెడ్డి సోదరి కూడా గవాస్కర్ పాదాలకు నమస్కరించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

మెల్‌బోర్న్ టెస్టు మూడో రోజు ఆట ముగిసిన అనంతరం నితీష్ కుమార్ రెడ్డి కుటుంబం గవాస్కర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో నితీష్ తండ్రి భావోద్వేగానికిలోనయ్యారు. గవాస్కర్ కనిపించగానే ఆయనను ఆలింగనం చేసుకోవడానికి ముందు కాళ్లపై పడ్డారు. మోకాళ్లపై కూర్చుని కాల్లు మొక్కారు. అదేవిధంగా తన కుమారుడిపై ప్రశంసలు కురిపించిన మాజీ ఆటగాళ్లు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో సునీల్ గవాస్కర్.. నితీష్ కుమార్ రెడ్డి గురించి, అతని బ్యాటింగ్ గురించి మాట్లాడారు. ఆతనో వజ్రమని కితాబిచ్చాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 8వ స్థానంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి.. 189 బంతులు ఎదుర్కొని 114 పరుగులు చేశాడు. దాంతో ఇన్నింగ్స్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నితీష్ ఆటను టెస్టు చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా క్రికెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజా ఇన్నింగ్స్‌తో భారత టెస్టు చరిత్రలో 8వ నంబర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలో దిగి రెండో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నితీష్ నిలిచాడు. అంతకుముందు 2002లో వెస్టిండీస్‌పై అజయ్ రాత్రా అజేయంగా 115 పరుగులు చేశాడు. కాగా మెల్‌బోర్న్‌లో సాధించిన సెంచరీని నితీష్‌కుమార్ రెడ్డి తన తండ్రికి అంకితమిచ్చాడు.





# 25 లక్షల నజరానా

**న్యూఢిల్లీ:** మెల్‌బోర్న్ టెస్టులో మెరుపులు మెరిపించిన యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అదిరిపోయే నజరానా ప్రకటించింది. ఆసీస్‌పై అద్భుత ప్రదర్శన కనబరుస్తూ టెస్టుల్లో తొలి సెంచరీ ఖాతాలో వేసుకున్న నితీశ్‌కు రూ.25లక్షల నగదు ప్రోత్సాహం ప్రకటించింది. టీమ్‌ఇండియా తరఫున అద్భుత ప్రదర్శన కనబరిచిన నితీశ్‌కు ఏసీఏ అధ్యక్షుడు కేసినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. మరోవైపు ఆసీస్‌ను దీటుగా ఎదుర్కొంటూ నితీశ్ చారిత్రక ఇన్నింగ్స్ ఆడాడంటూ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు.

# ఎముకలు కొరికే చలిలో..
## ఒళ్లు గగుర్పొడిచే సాహసం చేసిన రొనాల్డో..!

**మహా:** లెజెండరీ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పాపులారిటీ అంతా ఇంతా కాదు. రొనాల్డో ఏం చేసినా, ఏ పోస్టు సోషల్ మీడియాలో పెట్టినా అదీ సెన్సేషల్ అవుతూ ఉంటుంది. అయితే ఇదే క్రిస్టియానో రొనాల్డో ట్రెండ్‌ని ఫాలో అవుతున్నాడు. దీనిపై ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. క్రిస్టియానో రొనాల్డో క్రిస్మస్ సెలవులను ఆనందించడానికి తన కుటుంబంతో కలిసి ఫిన్‌లాండ్‌లోని లాప్‌లాండ్‌కు వెళ్లారు. ఈసారి రొనాల్డో మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ వద్ద స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేశాడు. ఈ విషయాన్ని సోషలల్ మీడియాలో షేర్ చేయడంతో అది నెటింట్లో ట్రెండింగ్‌గా మారింది. ఇంత చలిలో బట్టలు లేకుండా నిలబడటమే కష్టం రా బాబు అంటే..క్రిస్టియానో రొనాల్డో చల్లని నీటిలోకి దిగాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. ఈ వీడియోను పోస్ట్ చేసిన నిమిషాల వ్యవధిలోనే 93.1 మిలియన్లకు పైగా ప్రజలు వీక్షించారు. స్విమ్మింగ్ పూల్‌లో దిగే ముందు 'ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉంది" అని స్వయంగా రొనాల్డో వీడియోలో పేర్కొన్నాడు.



రొనాల్డో నెమ్మదిగా పూల్‌లో మెట్లుదిగుతాడు. ఎముకలు కొరికే చలిలో ఇలాంటి ప్రయోగం చేయడం ఎంత కష్టమో ఈ వీడియో చూస్తేనే అర్థమవుతుంది. రొనాల్డో పుల్‌లోకి దిగుతుండగా, అతని వెనుక ఉన్న వ్యక్తి పూల్ లోతు 2 మీటర్లు అని చెప్పాడు. దీని తరువాత, రొనాల్డో ఒక నిచ్చెన పట్టుకుని తన మెడ వరకు నీటిలోకి దిగి, నీరు కొద్దిగా చల్లగా ఉందని, చాలా బాగుంది అని ఉత్సాహంగా చెప్పాడు. కానీ కొన్ని నిమిషాల్లో, రొనాల్డో నీటి నుండి బయటకు వెళ్లిపోతాడు.

గత కొన్నేళ్లుగా సోషల్ మీడియాలో మంచు స్నానాలు ట్రెండ్‌గా మారాయి. చల్లటి నీళ్లలో స్నానం చేయడం వల్ల ఊబకాయం, డిప్రెషన్, యాంగ్జయిటీ వంటి సమస్యలు దూరమవుతాయని వైద్య నిపుణులు చెబుతూ ఉంటారు. క్రిస్టియానోకు సంబంధించిన ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. దీనిపై ఓ ఆరోగ్య నిపుణుడు, శాస్త్రవేత్త నవీంద్ర సూదూ స్పందించారు. చల్లని నీటిలో స్నానం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, ఇది శరీర వాపును తగ్గిస్తుందని కండరాల రికవరీని మెరుగుపరుస్తుందని తెలిపారు. దీనితో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందన్నారు. ఇక రొనాల్డో ఫిట్‌నెస్ గురించి మనందరికి తెలిసిందే.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కి చేరిన దక్షిణాఫ్రికా.. మరి భారత్ సంగతేంటి?

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడవ ఎడిషన్ ఫైనల్ రేసు ఉత్కఠగా సాగింది. ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ టిక్కెట్ కోసం మూడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తాజాగా దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్ రేసులో దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో ఓడించి WTC ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. థెంబా బావుమా నేతృత్వంలోని జట్టు పాకిస్థాన్‌పై ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 2 వికెట్ల తేడాతో విజయం సాధించి తొలిసారి టైటిల్ మ్యాచ్‌కు టిక్కెట్‌ను బుక్ చేసుకుంది. సెంచూరియన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు, కగిసో రబడ, మార్కో జాన్సన్ 9వ వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో దక్షిణాఫ్రికా ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించింది. గెలిచిన మ్యాచ్‌లో ఓడిపోయిన పాకిస్థాన్ సిరీస్‌ను కోల్పోయింది.

రెండు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క మ్యాచ్ గెలిచినా, ఆఫ్రికా జట్టు WTC ఫైనల్స్‌కు చేరుతుంది. అందుకు తగ్గట్టు




గానే తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరుకోవడంలో సఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్‌ను 237 పరుగులకు ఆలౌట్ చేసిన దక్షిణాఫ్రికాకు 148 పరుగుల విజయ లక్ష్యం ఉంది. లక్ష్యం చిన్నదే కావడంతో దక్షిణాఫ్రికా సులభంగా గెలుస్తుందని అందరూ భావించారు.కానీ పాకిస్థాన్ పేసర్లు అబ్బాస్, ఖుర్రం షాజాద్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్రికాకు ఆరంభంలోనే షాక్ ఇచ్చారు. అయితే ఇక్కడి నుంచి జట్టు ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్న ఐడెన్ మార్క్రామ్, కెప్టెన్ తెంబా బావుమా నెమ్మదిగా జట్టును విజయతీరాలకు చేర్చారు. నాలుగో రోజు ఈ జోడీ 27 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. కానీ ఈసారి అటాక్ చేసిన మహ్మద్ అబ్బాస్ మార్క్రమ్ వికెట్ తీశాడు.దీని తర్వాత కూడా కెప్టెన్‌గా ఆడిన తెంబా బావుమా జట్టును 96 పరుగులకు చేర్చాడు. దక్షిణాఫ్రికా విజయానికి 52 పరుగులు చేయాల్సి ఉంది. జట్టు వద్ద ఇంకా 6 వికెట్లు ఉన్నాయి. అయితే ఇక్కడ కెప్టెన్ బావుమా చేసిన తప్పిదంతో జట్టు ఇన్నింగ్స్ తడబడింది. అబ్బాస్ బంతిపై అనవసరంగా భారీ షాట్‌కు వెళ్లి బావుమా వికెట్‌ను కోల్పోయాడు. దురదృష్టవశాత్తు ఆ దశలో బావుమా నాటౌట్‌గా లేరు. కానీ అంపైర్ ఇచ్చిన నిర్ణయాన్ని సమీక్షించకుండా బావుమా పెద్ద తప్పు చేశాడు. ఎందుకంటే రివ్యూలో బంతి అతని బ్యాట్‌కు బదులుగా బావుమా తొడ ప్యాడ్‌కు తగిలిందని స్పష్టమైంది. ఇక్కడి నుంచి అబ్బాస్ ధాటికి దక్షిణాఫ్రికా తర్వాతి 11 బంతుల్లో 3 వికెట్లు కోల్పోయింది. వరుస బంతుల్లో డేవిడ్ బెడింగ్‌హామ్, కార్బిన్ బోష్‌లను అవుట్ చేయడం ద్వారా అబ్బాస్ మొదటిసారిగా ఒక టెస్టులో 6 వికెట్లు తీశాడు.

# శభాష్ నితీశ్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు

**హైదరాబాద్ :** ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో సూపర్ సెంచరీతో విజృంభించిన నితీశ్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ 'ఆసీస్‌పై నితీశ్ వీరోచితమైన ఇన్నింగ్స్. నీ ప్రదర్శనకు సలామ్ యంగ్‌మ్యాన్. మెల్‌బోర్న్‌లో చారిత్రక ఇన్నింగ్స్‌తో కదంతొక్కావు. నితీశ్‌లో నీలో భవిష్యత్ భారత కెప్టెన్‌ను చూస్తున్నాను. దేశానికి గర్వపడే క్రికెటర్‌ను అందించిన ముత్యాలరెడ్డితో పాటు కుటుంబసభ్యులకు అభినందనలు' అని పేర్కొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 30-12-2024



# కనీవినీ ఎరుగని సరికొత్త ప్రపంచం

రాజమౌళి, మహేశ్‌బాబు సినిమా అప్‌డేట్ అంటూ కొందరు నెటిజన్లు తోచినట్టు రాసేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరిలో మొదలుకానున్నదంటూ ఓ వార్త సోషల్‌మీడియాలో ఓ రేంజ్‌లో చక్కర్లు కొట్టింది. అయితే.. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ నుంచి మొదలు కానున్నదట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల కానుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో కనీవినీ ఎరుగని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించనున్నట్టు ఈ చిత్ర రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో భారతీయ నటులతో పాటు విదేశీ నటులు కూడా భాగం కానున్నారు.

హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేయనున్నారు. దాదాపుగా వెయ్యికోట్ల భారీ బడ్జెట్‌తో దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మించనున్న ఈ చిత్రాన్ని భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాలో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ కథానాయికగా నటిస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి.

తాజాగా మరో నటి పేరు తెరపైకి వచ్చింది. ఆమె ఎవరో కాదు, బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. దర్శకుడు రాజమౌళి ఆమెతో చర్చలు కూడా జరిపినట్టు సమాచారం. ఈ కథలో హీరోయిన్ పాత్రకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని రాజమౌళి భావించినట్టు తెలుస్తున్నది. ప్రియాంక కూడా ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టులో నటించేందుకు ఉత్సాహం చూపిస్తున్నట్టు బీటౌన్ టాక్. ఈ పాత్ర కోసం ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టిందట.



## రైలులో డైరెక్టర్ పెళ్లికి వెళ్లిన బాలీవుడ్ భామ

# నోరా ఫతేహి

సామాన్యులకు రైలు ప్రయాణం సాధారణ విషయమే! సెలెబ్రిటీలు రైళ్లలో వెళ్తే మాత్రం.. అది సెన్సేషనే! తాజాగా, బాలీవుడ్ భామ నోరా ఫతేహి చేసిన రైలు ప్రయాణం.. ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. తన మిత్రుడు, క్రియేటివ్ డైరెక్టర్ అనూప్ సర్వే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు రైల్‌లో ప్రయాణించింది నోరా. ఇందుకు సంబంధించి ముంబయిలోని దాదర్ రైల్వే స్టేషన్‌లో ఉన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. రైల్‌లోనే రత్నగిరికి చేరుకున్న నోరా.. డైరెక్టర్ హల్దీ వేడుకలో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆమె చేసిన డ్యాన్స్ వీడియో కూడా నెట్టింట చెక్కర్లు కొడుతున్నది. డైరెక్టర్ అనూప్‌తో తనకు ఎనిమిదేళ్లుగా పరిచయం ఉన్నదనీ, 2017 నుంచి తన సినీ ప్రయాణంలో అనూప్ తోడుగా ఉన్నాడనీ రాసుకొచ్చింది. కెనడాలో పుట్టిపెరిగిన నోరా ఫతేహి.. నటనపై ఆసక్తితో భారత్‌కు వచ్చింది. ఎంతో కష్టపడి సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నది. బాహుబలిలో 'మనోహరి' పాట.. నోరా కెరీర్‌నే మలుపు తిప్పింది. ఆ తర్వాత 'సత్యమేవ జయతే' సినిమాలోని 'దిల్బర్ దిల్బర్' రీమిక్స్ పాటతో.. దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నది. ప్రస్తుతం ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న 'కేడీ- ద డెవిల్' చిత్రం ద్వారా కన్నడలో అరంగేట్రం చేస్తున్నది నోరా ఫతేహి.

# రాంచరణ్ భారీ కటౌట్

**అమరావతి :** గ్లోబల్‌స్టార్ రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా విజయవంతం కావాలని కోరుతూ ఆయన అభిమానులు భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి విజయవాడ వజ్ర గ్రౌండ్‌లో 256 అడుగుల ఎత్తు వరకు రాంచరణ్ కటౌట్‌ను నెలకొల్పారు. రాంచరణ్ పేరిట గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డు ఉండాలనే లక్ష్యంతో ఈ భారీ కటౌట్‌ను రాంచరణ్ యువశక్తి ఆధ్వర్యంలో నెలకొల్పామని అభిమానులు తెలిపారు. సుమారు వారం, పదిరోజుల పాటు నుంచి చెన్నై వారి సహకారంతో నిర్మాణ పనులు చేపట్టామని వెల్లడించారు. కాగా వజ్ర గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం జరుగనున్న గేమ్‌ఛేంజర్ వేడుకల్లో కటౌట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాంచరణ్‌కు బహుమానంగా ఇవ్వాలని భావించి కటౌట్‌ను నిర్మించామని తెలిపారు. సాయంత్రం జరిగే వేడుకలకు దర్శక, నిర్మాతలతో పాటు చిత్ర బృందం సభ్యులు పాల్గొంటారని వివరించారు. ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వరా క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించిన గేమ్ ఛేంజర్ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించాడు. రామ్ చరణ్, కియారా అద్వాణి, ఎస్.జె.సూర్య, సునీల్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 2025 జనవరి 10న విడుదల కానుంది.






# కృతి కాదు కీర్తి!

ముంబయి మీడియా ఫొటోగ్రాఫర్ల అనుచిత వ్యాఖ్యలు కథానాయిక కీర్తి సురేష్‌కు కాస్త అగ్రహం తెప్పించాయి. అయినా భావోద్వేగాలను నియంత్రించుకొని ఆమె వ్యవహరించింది. ఈ నేపథ్యంలో దక్షిణాది నాయికలపై అక్కడి మీడియా వివక్షాపూరిత వైఖరి పట్ల విమర్శలొస్తున్నాయి. ఈ వివాదం వివరాల్లోకి వెళితే.. హిందీ చిత్రసీమలో అరంగేట్రం చేస్తూ కీర్తి సురేష్ నటించిన 'బేబీ జాన్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ముంబయిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై బయటికొస్తున్న కీర్తి సురేష్‌కు మీడియా ఫొటోగ్రాఫర్లు ఎదురుపడ్డారు. ఫొటోలు తీస్తున్న సమయంలో కొందరు ఆమెను 'కృతి' అనే పేరుతో పదే పదే పిలిచారు. దీంతో ఆసహనానికిలోనైన కీర్తి సురేష్.. తన పేరు కీర్తి అని వారికి గుర్తు చేసింది. ఇంతలోనే కొందరు ఫొటోగ్రాఫర్స్ కీర్తి దోశ అంటూ పిలిచారు. ఆ పిలుపుతో ఇబ్బందికి గురైంది కీర్తి సురేష్. అయినా తన కోపాన్ని అణచుకొంటూ 'నా పేరు కీర్తి సురేష్. కీర్తి దోశ కాదు.. దోశ నాకు చాలా ఇష్టం' అంటూ నవ్వుతూ సమాధానమిచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దక్షిణాది నాయికలను అవహేళన చేసే విధంగా 'దోశ' అని పిలవడం పట్ల పలువురు సినీ తారలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

# అలా పిలవకండి..

## పవన్ అభిమానులకు ఓజీ టీమ్ రిక్వెస్ట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రీసెంట్‌గా తన అభిమానుల మీద అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుని శనివారం పవన్ కళ్యాణ్ పరామర్శించిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా.. అతని అభిమానులు ఓజీ.. ఓజీ.. ఓజీ.. సీఎం.. సీఎం అని పిలవడం మొదలుపెట్టారు. దీంతో అసహనానికి గురైన పవన్ కళ్యాన్.. అభిమానులను ఉద్దేశించి.. మీకు ఎక్కడ ఏం స్లోగన్ ఇవ్వాలో కూడా తెలియకపోతే ఎలా అయ్యా.. పక్కకి వెళ్లండి అంటూ అసహ్యించుకున్నాడు. దీంతో ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై తాజాగా ఓజీ టీం స్పందిస్తూ.. అభిమానులు ఓజీ అని పవన్‌ని పిలవద్దంటూ రిక్వెస్ట్ చేసింది. ఓజీ సినిమాపై మీరు చూపిస్తున్న అభిమానం, ప్రేమ మా అదృష్టంగా భావిస్తున్నాము. ఓజీ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి నిరంతరం పని చేస్తున్నాం. కానీ మీరు పవన్ కళ్యాణ్ గారు పొలిటికల్ సభలకు వెళ్లినప్పుడు, సమయం, సందర్భం చూడకుండా ఓజీ.. ఓజీ అని అరవడం, వారిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంత కష్టపడుతున్నారో మనందరికీ తెలుసు. ఆ స్థానాన్ని, స్థాయిని గౌరవించడం మన కనీస బాధ్యత. అందుకని ఇంకొన్ని రోజులు ఓపికగా ఉందాం. 2025 ఓజీ పండుగ వైభవంగా నిలుస్తుందని మేము గట్టిగా నమ్ముతున్నాం అంటూ డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ రాసుకొచ్చింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com